# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
ఆదివారం
29-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 279
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం

జమ్మూకశ్మీర్ పౌరుల హక్కులను కాపాడుతాం

ఎన్నికల ప్రచారంలో ప్రియాంక హామీ

7



## దేశ ప్రయోజనాలే ఏచూరి మిన్న

ఇండియా కూటమి తెరవెనుక ఏచూరి కీలక పాత్ర

ఏచూరికి నేను స్నేహితుడిని అయినందుకు గర్వంగా ఉంది

రాహుల్ గాంధీ

7

## వేర్పాటువాదం.. రక్తపాతానికి చోటులేదు

బీజేపీ పాలన కోరుకుంటున్న కాశ్మీర్‌లో ప్రజలు

మూడో విడత ప్రచారంలో ప్రధాని మోదీ

అర్బన్ నక్సల్స్ గుప్పిట కాంగ్రెస్

వారిని బుజ్జగించడానికి ఏమైనా చేస్తుంది

జమ్మూ కశ్మీర్ ఎన్నికల సభల్లో మోదీ

వివరాలు 7లో





## ప్రజలపై ఉచిత వరాల జల్లులు

### కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల..

**హర్యానా, సెప్టెంబర్ 28 :** హర్యానా ప్రజలపై కాంగ్రెస్ వరాల జల్లు కురిపించింది. ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, మహిళలకు ఆర్థిక సాయం, రైతులకు ఎంఎస్పీ హామీ, కుల గణన వంటి వాగ్దానాలు ఇచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కేసీ.వేణుగోపాల్, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉదయ్ భాన్ సమక్షంలో మిగతా 7లో...



## ఫ్యామిలీ డిజిటల్ కార్డులో మహిళే యజమాని



సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా కుటుంబాల నిర్ధారణ

నియోజకవర్గానికి రెండు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

3 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన..

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 28 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డులో.. మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలను కార్డు వెనుక పేర్కొనాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా డిజిటల్ కార్డుకు కుటుంబాల నిర్ధారణ చేయాలన్నారు. శనివారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న కార్డులను పరిశీలించి ఉత్తమ విధానాలు స్వీకరించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డు వంటి సమాచారం సేకరించాల్సిన అవసరం లేదన్నారు. కాగా, ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఇటీవలే రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించింది. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై ఈ సందర్భంగా అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మిగతా 2లో...

# పేదలకు న్యాయం జరగాలి



న్యాయవాదులు పారదర్శకంగా ఉండాలి

అట్టడుగు వర్గాలకు న్యాయం అందేలా కృషి చేయాలి

సంపన్నులతో పోలిస్తే నేటికీ న్యాయం పొందలేని పేదలు

అందరికీ సమాన న్యాయం.. అదే రాజ్యాంగం చెబుతుంది

చంద్రగుప్తుని కాలంలోనే కోర్టుల వ్యవస్థ

మహాత్మా గాంధీ, అంబేద్కర్ న్యాయవాదులే

న్యాయవ్యవస్థలోనూ కృత్రిమ మేధ అమలు

నల్సార్ విద్యార్థులకు డిగ్రీలు, బంగారు పతకాలు ప్రదానం

పట్టాలు అందుకున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉండటం సంతోషకరం : ద్రౌపది ముర్ము

నల్సార్ న్యాయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమమేధను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. కృత్రిమ మేధ పేదలకు అందుబాటులోకి రావాలని, వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ధనికులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేక పోతున్నారని.. మెరుగైన సమాజం కోసం ఈ విధానంలో మార్పు రావాలని రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ న్యాయబద్ధంగా సత్యాగ్రహ దీక్ష చేసి ఆదర్శంగా నిలిచారని ముర్ము అన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే న్యాయవాద వృత్తిలో ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని తెలిపారు. శనివారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 21వ మిగతా 2లో...

## హైడ్రోజన్ బాంబులా హైడ్రా..



మూసీలో పేదల రక్తం పారించే ప్రయత్నం

బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్య

మాజీ మంత్రి హరీశ్‌రావు

వివరాలు 2లో..

## కాంగ్రెస్ కొరివితో తల గోక్కుంటోంది

హైడ్రా కూల్చివేతల్లో అంతా హిందూ బాధితులే

కేంద్రమంత్రి బండి సంచలన వ్యాఖ్యలు





## స్థానిక సమస్యలపైనా పోరాడుతుండాలి

15 రోజుల్లో.. 40 లక్షల సభ్యత్వాలే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులను ప్రోత్సహించండి

పార్టీ శ్రేణులకు బీజేపీ అధ్యక్షుడు నడ్డా సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 28 (మనం న్యూస్):** రాబోయే 15 రోజుల్లో 40 లక్షల పార్టీ సభ్యత్వాల నమోదు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నేతలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తితో ఉన్న వారి నాయకత్వాన్ని ప్రోత్సహించి పార్టీ సభ్యత్వాలు సాధించాలన్నారు. హైడ్రా, రైతు సమస్యలపై ప్రజాపోరాటాలు చేస్తూనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించాలని మిగతా 2లో...

# హైడ్రా అంటే భయం కాదు.. భరోసా



మూసీ నిర్వాసితుల్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

మూసీ సుందరీకరణతో మారనున్న భాగ్యనగరం

వర్షాకాలంలో వరదలు రాకుండా విస్తరణ

ఇప్పటికే ప్రణాళికలు రూపొందించిన ప్రభుత్వం

కార్పొరేషన్ ఎండి దానకిశోర్ వెల్లడి

హైడ్రాను బూచిగా చూపి తప్పుడు ప్రచారం

ప్రభుత్వ స్థలాలు, చెరువులు రక్షించుకోవాల్సిందే

హైడ్రాలాంటి వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు

కబ్జాల వెనక ఎందరో పెద్దలు ఉన్నారు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

7

**హైడ్రా కమిషనర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీలో కేసు**

## అభివృద్ధి సంక్షేమంపై నిరంతర పోరాటం

ధనార్జన లేని ప్రజా రాజకీయాలే మా ఎజెండా

పదేళ్ల పాటు అమరుల ఆశయాలు కాలగర్భంలో కలిశాయి

తెలంగాణ సాధన కోసం పోరాడిన కుటుంబాలు చీకట్లో మగ్గుతున్నాయి

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్ల అవినీతి

టిజెఎస్ ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

వివరాలు 2లో



మనం

Follow : @Manamnews



# కాంగ్రెస్ కొరివితో తల గోక్కుంటోంది

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** హైడ్రా అనే కొరివితో కాంగ్రెస్ పార్టీ తల గోక్కుంటోందని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. హైడ్రా కూల్చివేతలతో ప్రజల కన్నీళ్లు, ఆర్తనాదాలు మీకు గుర్తుకు రావడం లేదా? ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో మళ్లీ పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమయ్యారా? అని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో ఇళ్లు కూల్చడం, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకపోవడం, మాజీ సర్పంచులకు బిల్లుల బకాయిలే కాంగ్రెస్ కొంపముంచుతాయన్నారు. కూల్చివేత లకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా త్వరలో చలో హైదరాబాద్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. బండ్లగూ డ జాగీర్లో శ్రీ విద్యారణ్య నూతన భవన సముదాయం ప్రారంభో త్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో మూసీ చుట్టు పక్కల ఉన్న పేద హిందువుల ఇళ్లను కూల్చివేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైం దని ఆరోపించారు. మలక్పేట రేసు కోర్సు నుంచి ముసారాంబాగ్ వరకు మూసీ స్థలాలను ఓవైసీ అనుచరులు కబ్జాలు చేశారని, వాటిని టచ్ చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు.

### జగన్.. లడ్డూను కల్తీ చేసినట్టే ఉంది: బండి

కాగా తిరుమల డిక్లరేషన్ అంశంపై ఏపీ మాజీ సీఎం జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. హిందూయేతరులు తిరుమలకు వస్తే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధన ఎప్పట్నుంచో అమల్లో ఉందని, కొత్తగా కనిపెట్టిందేమీ కాదన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రపతి హోదాలో తిరుమల వెంకన్నస్వామి ని దర్శించుకునేందుకు వచ్చి డిక్లరేషన్ సమర్పించారని, అబ్దుల్ కలాం కంటే జగన్ ఎక్కువా? అని ప్రశ్నించారు. గతంలో జగన్ హిందువుల ఓట్ల కోసమే తిరుమల వెళ్లినట్లు అనిపిస్తోందన్నారు. జగన్ తీరు చూస్తుంటే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు అనిపిస్తోందన్నారు. దళితులకు తిరుమలలో అన్యాయం జరుగు తోందని ఆయన చెప్పడం సిగ్గుచేటన్నారు. దళితులను అడ్డుపెట్టు కొని జగన్ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని.. ఆయన తీరు ముమ్మాటికీ హిందూత్వపై జరుగుతున్న దాడిలో భాగమేనన్నారు.

# హైడ్రోజన్ బాంబులా హైడ్రా..

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** హైడ్రా.. హైడ్రోజన్ బాంబులా మారిందని, ఎవరికీ కంటి మీద కునుకు లేకుండా పోయిందని మాజీ మంత్రి హరీశ్రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీలో గోదావరి నీళ్లు పారిస్తానని చెప్పి పేద, మధ్య తరగతి ప్రజల రక్తం, కన్నీళ్లు పారించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం తెలంగాణ భవన్లో మూసీ సుందరీకరణ బాధితులతో మాజీ మంత్రులు హరీశ్రావు, సబితాఇంద్రారెడ్డి సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. హైడ్రా బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్లో 24 గంటలు బీఆర్ఎస్ లీగల్ టీమ్ అందుబాటులో ఉంటుందని భరోసానిచ్చారు. కాగా, పైసా.. పైసా కూడబెట్టి ఇళ్లు కొన్నామని.. కూల్చివేతల విషయం తెలిసినప్పటి నుంచి గొంతులో ముద్ద దిగడం లేదని బాధితులు హరీశ్ ముందు గోడు వెళ్లబోసుకుని కన్నీరు పెట్టగా.. హరీశ్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. మరోవైపు.. హైడ్రా అధికారుల వేధింపుల కారణంగానే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు. ఇది ఆత్మహత్య కాదని రేవంత్రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని ధ్వజమెత్తారు. కూకట్పల్లిలో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహం గాంధీ మార్చురీలో ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యేలు హరీశ్రావు, సబితా ఇంద్రారెడ్డి, మాధవరపు కృష్ణారావులు ఆస్పత్రికి చేరుకున్నారు. బుచ్చమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్రావు మాట్లాడుతూ తన ఇల్లును ఎక్కడ కూల్చివేస్తారనో భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. హైడ్రా భయంతో ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇంకా ఎంత మందిని చంపదలుచుకున్నారని ఆయన ప్రశ్నించారు.

# స్థానిక సమస్యలపైనా పోరాడుతుండాలి

మొదటి పేజీతరువాయి...



దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు హైదరాబాద్లోని హరిత ప్లాజాలో పార్టీ ముఖ్య నేతలతో శనివారం సమావేశమైన జేపీ నడ్డా.. పార్టీ సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో 50 లక్షల సభ్యత్వాల నమోదు లక్ష్యం కాగా ఇప్పటివరకు 10 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని మిగిలిన 40 లక్షలను 15 రోజుల్లోగా పూర్తి చేసేలా పని చేయాలని నేతలను కోరారు. ఈ ప్రక్రియలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా నేతలు పని చేయాలని సూచించారు. యువతను ప్రోత్సహించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల పనుల్లో ఉన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఈ సమీక్షకు గైర్హాజరవ్వగా.. పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. కాగా, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులల్లో సగం కంటే ఎక్కువ మంది ఈ సమావేశానికి దూరంగా ఉండడం గమనార్హం. అంతకముందు శనివారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న జేపీ నడ్డాను బండి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్రావు తదితరులు స్వాగతించారు.

# పేదలకు న్యాయం జరగాలి





మొదటి పేజీతరువాయి...

స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్డీ, ఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందించారు. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, స్నాతకోత్సవ ప్రసంగంలో చట్టంలోని వివిధ రంగాలలో నల్సార్ కృషిని ప్రశంసించారు. ప్రధానంగా నల్సార్ జంతు సంరక్షణ చటాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఒరిస్సా ప్రభుత్వంలో తాము మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా ఆమె గతంలో పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, జంతువుల రక్షణ, సంక్షేమం గురించి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ జంతు సంరక్షణ చట్టాల అవగహన అత్యవసరం అని అన్నారు. భారతదేశంలోని ప్రాచీన భారత పరిపాలన, న్యాయ సంప్రదాయాలను గురించి మాట్లాడారు. కౌటిల్యుని అర్థశాములో, ప్రాచీన భారత్ దేశంలో చట్టపరమైన పరిపాలనా వివరణ ఉన్నది అని తెలిపారు. దక్కన్ ప్రాంతంలో రచించబడిన అపస్తంభధర్మసూత్రాలను ఆమె ప్రస్తావించింది. దేశం ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని పట్టభద్రులు గుర్తు ఉంచుకోవాలని ఆమె ఉద్బోధించారు. మహాత్మా గాంధీ, డా.బి.ఆర్ అంబేద్కర్లను ప్రస్తావిస్తూ, కరుణ వృత్తి పర నైపుణ్యాల సమ్మేళనం ఆ మహా మానవులు అందించిన సూత్రమని అన్నారు. సున్నితత్వం న్యాయబద్ధత అనే రెండు గుణాల కలయికగా ఆ మహా నాయకులు ఉండినారు అని ఆమె కొనియాడారు. విజయవంతమైన వృత్తి జీవితాన్ని పొందాలనుకునే న్యాయ నిపుణుల కోసం ఆ విలువలను పాటించాలి అని ఆమె చెప్పారు. మన రాజ్యాంగ విలువలో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులకు ఆమె సూచించారు. నిజాయితీ, ధైర్యం విలువలకు కట్టుబడి సానుకూల సామాజిక మార్పులకు సారథులుగా నూతన స్నాతకులు ఉండాలని ఆమె కోరారు. బంగారు పతకాల విజేతలలో బాలిక విద్యార్థులు పతకాలు బాలురు కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అధ్యక్షుడు ముర్ము తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో అనేక ఉన్నత విద్యాసంస్థల్లో బాలికా విద్యార్థులు మంచి ప్రతిభను చూపుతున్నారు అనిఆమె అన్నారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ కుమార్తెలు తమ ఉన్నత ప్రదర్శన తో మనల్ని గర్వ పడేలా చేస్తున్నారని ఆమె అన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన అమ్మాయిలు ఇతర మహిళలు, తక్కువ ప్రాధాన్యత కలిగిన బాలికలకు సహాయం, సాధికారత కల్పించాలని ఆమె ఉద్బోధించారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్వర్క్ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నెట్వర్క్ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి, అలాంటి అఘాయిత్యాల కేసులను ఎదుర్కోవడానికి సంఘటిత ప్రయత్నాలు చేయడానికి ఎంతో పని చేయగలదు అన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. నల్సార్ గ్రాడ్యుయేట్లు సామాజిక న్యాయం అభివృద్ధికి సమర్థవంతమైన సాధనంగా ఉండాలని, మన జాతీయ లక్ష్యాలను సాకారం చేసుకునేందుకు విలువైన సహకారం అందించాలని ఆమె కోరారు. నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొ.కృష్ణదేవరావు తన సంక్షిప్త స్వాగత ప్రసంగంలో వికలగుల హక్కుల చట్టాలు, బాలల హక్కులు, ఖైదీల హక్కులు సంస్కరణల రంగాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నల్సార్స్ సాధించిన విజయాలను గురించి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్విభాగ అధ్యయనాలు చేయడం ఆధునిక విద్యారంగంలో చాలా ప్రధానం అని, నల్సార్ బోధనా అభ్యసన పరిశోధన కార్యక్రమాన్ని విస్తరించడానికి, యూనివర్శిటీ విద్య విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా 57 బాగారు పతకాలను రాష్ట్రపతి బహూకరించారు. బీఏ ఎల్ఎల్బీకి చెందిన భవ్య జోహారి డి పది బంగారు పతకాలతో బంగారు పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, అదే తరగతికి చెందిన కుమారి అమీషి ఏడు పతకాలతో రెండవ స్థానంలో నిలిచారు. నల్సార్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే, గౌరవ అతిథి, గౌరవనీయులైన జస్టిస్ పి.ఎస్. నరసింహ, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి పట్టభద్రులైన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు. వాటిలో ఎనిమిది పీహెచ్డీలు, లా మరియు బిజినెస్ అడ్మినిస్టేషన్లో వరుసగా 68 మరియు 48 మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి, 115 మరియు 28 బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ లా మరియు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్లలో, ప్రదానం చేయబడ్డాయి.

సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. నల్సార్లో న్యాయ విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలని, విశ్వవిద్యాలయానికి, కుటుంబసభ్యులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహకారం అందజేస్తామని ప్రకటించారు. స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ చాన్సలర్ జస్టిస్ అలోక్ అరాధే, వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు, మంత్రి సీతక్క పాల్గొన్నారు. స్నాతకోత్సవ ఊరేగింపునకు ప్రొఫెసర్.ఎన్.వాసంతి రిజిస్ట్రార్ నల్సార్ విశ్వవిద్యాలయం నేతృత్వం వహించారు.



అంతకుముందు ఉదయం 11గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రాయానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్రెడ్డి స్వాగతం పలికారు. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం అనంతరం సికాంద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య ప్రాంతా అభివృద్ధి మంత్రిత్వశాఖ, సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న కళామహోత్సవ్ను రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బేగంపేటకు చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డులో మహిళే యజమాని

మొదటి పేజీతరువాయి...

డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు సీఎం పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. కార్డుల్లో పొందుపరచాల్సిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, దామోదర రాజనర్సింహతో కూడిన మంత్రివర్గ ఉపసంఘానికి అందజేయాలని ఆదేశించారు. ఉపసంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలతో సమగ్ర జాబితా రూపొందించాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అమలుకు రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ రెండు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేయాలని, పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లోనైతే రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పూర్తిగా నగర, పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు, డివిజన్లను ఎంపిక చేయాలన్నారు. కుటుంబాల నిర్ధారణ, డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయించాలని అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో అక్టోబరు 3 నుంచి ఈ పరిశీలన చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికీ ఆర్డీవో స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్కు చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధి

### రూ.826 కోట్ల ప్రాజెక్టుకు సీఎం రేవంత్ ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.826 కోట్లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్రెడ్డి ఆమోదముద్ర వేశారు. ఇటీవల ఆరు జంక్షన్ల అభివృద్ధి నమూనా వీడియోలను జీహెచ్ఎంసీ విడుదల చేసింది. హెచ్సిటీ ప్రాజెక్టులో భాగంగా వీటిని రెండు ప్రాజెక్టులుగా జీహెచ్ఎంసీ అభివృద్ధి చేయనుంది. మొదటి ప్యాకేజీలో రూ.421 కోట్లతో జూబ్లీహిల్స్ చెక్ పోస్టు జంక్షన్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ అభివృద్ధి చేయనున్నారు. రెండో ప్యాకేజీలో రూ.405 కోట్లతో రోడ్ నెం.45 జంక్షన్, ఫిల్మ్ నగర్ జంక్షన్, మహారాజా అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ల అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

# మూసీ సుందరీకరణలో ఘరానా మోసం

### మూడింతలు అంచనాల పెంపు వెనక కుట్రలు: కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ఘరానా మోసానికి దిగారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మూసీ సుందరీకరణకు అంచనాలు అమాంతంగా ఎందుకు పెంచారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్లో ఓ పోస్ట్ చేశారు. రూ.50 వేల కోట్ల అంచనాలను రూ.1.50 లక్షల కోట్లకు ఎందుకు పెంచారన్నారు. మూసీ ద్వారా ఎంత మందికి తాగునీరు, సాగునీరు ఇస్తారని ప్రశ్నించారు. ' మొన్న.. 50 వేల కోట్లు అయితదన్నరు. నిన్న.. 70 వేల కోట్లు వెచ్చిస్తామన్నరు. నేడు.. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నరు. తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీదాకా గగ్గోలుపెట్టింది కాంగ్రెస్. మరి.. సుందరీకరణకే.. రూ.లక్షా యాభై వేల కోట్లా..! పదిహేను పక్కన ఇన్ని సున్నాలా..!! ఇంతకీ మూసీ ప్రాజెక్టుతో.. మురిసే



రైతులెందరు..! నిల్వ ఉంచే టీఎంసీలెన్ని..! సాగులోకి వచ్చే ఎకరాలెన్ని..!! పెరిగే పంటల దిగుబడి ఎంత..!! తీర్చే పారిశ్రామిక అవసరాలెంత..!!! కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లెన్ని..!!! పుట్టిన గడ్డపై.. మమకారం లేని.. ముఖ్యమంత్రి గారికి..పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకన్నా.. మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ ?? చివరిదశలో ఉన్న ప్రాజెక్టును పక్కనపెట్టి.. కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి మూసీ చుట్టే ఎందుకింత మంత్రాంగం..?? లండన్ లోని థేమ్స్ లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి ? గేమ్ ఎలాన్ ఏంటి ?? మూడింతలు పెంచిన మూసీ అంచనా వ్యయం కాంగ్రెస్ ధనదాహానికి సజీవ సాక్ష్యం. తట్టెడు మన్ను తీయకముందే.. కోట్లు తన్నుకుపోయే కుట్రకు తెరతీస్తే భరించం. 'మూసీ రివర్ ఫ్రంట్' పేరిట..బ్యాక్ డోర్ లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం అనుక్షణం గమనిస్తోంది. కుంభకోణాల కాంగ్రెస్కు కర్రుగాల్చి వాతపెడుతుంది' అని కేటీఆర్ హెచ్చరించారు.మూడింతలు పెంచిన అంచనా వ్యయం కాంగ్రెస్ ధన దాహానికి సజీవసాక్ష్యం' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# కాంగ్రెస్లో బీసీలకు పెద్దపీట

### త్వరలోనే కార్యవర్గం కూర్పుపై చర్చిస్తా

### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** భవిష్యత్లో బీసీలకే ఎక్కువ సీట్లు ఇస్తామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్లో మీడియా ప్రతినిధులతో మహేష్ కుమార్ గౌడ్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే టీపీసీసీ కార్యకర్గ విస్తరణ చేపడతామని.. డీసీసీ బాధ్యతలు ఎమ్మెల్యేలకు ఇవ్వాలనే ప్రతిపాదన ఉందని వెల్లడించారు. పీసీసీ కార్యకర్గ విస్తరణపై త్వరలోనే ఏఐసీసీ పెద్దలను కలుస్తామని పేర్కొన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఇబ్బంది పడుతున్నది వాస్తవమేనని.. కొత్త పాత నేతల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తు న్నామని చెప్పారు. మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం చేయాలన్న బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు మల్లన్న సాగర్ బాధితుల కన్నీళ్లు హరీష్ రావుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్ నిర్వాసితులను పరామర్శించేందుకు మేము వెళ్తే మమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేయలేదా అని నిలదీశారు. మల్లన్న సాగర్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా న్యాయం చేస్తోందన్నారు. హైడ్రా, మూసీ అభివృద్ధితో సామాన్యులకు కొంత ఇబ్బందైనా.. హైదరాబాద్ మొత్తానికి లాభం జరుగుతుందని స్పష్టం చేశారు.




చిన్న జీయర్ స్వామి శనివారం గ్లోబల్ హిందూ ఫెడరేషన్ యాప్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీ చవాన్, వీర ధర్మజ స్వామి, శ్రీ యోగీశ్ ప్రభు గురూజీలు పాల్గొన్నారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):

# హెలెన్ బీభత్సం

### విరుచుకుపడిన కేటగిరి 4 హరికేన్

### 52 మంది మృతి, అంధకారంలో 30 లక్షల మంది

**పెర్రీ, సెప్టెంబరు 28:** అమెరికా ఆగ్నేయ ప్రాంతంలో హెలెన్ తుఫాను విధ్వంసం సృష్టిస్తోంది. తుఫాను ధాటికి ఐదు రాష్ట్రాల్లో దాదాపు 52 మంది చనిపోగా అపారమైన ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గురువారం రాత్రి ఫ్లోరిడాలోని బిగ్బెండ్ ప్రాంతంలో మొదలైన కేటగిరి 4 హరికేన్ భీకర గాలులతో విరుచుకుపడింది. గంటకు 225 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. జార్జియా, కరోలినా, టెన్నెస్సీ గుండా సాగిన హెలెన్ ధాటికి అనేక వృక్షాలు నేల కూలగా, జనావాసాలు చెల్లాచెదురయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, తీవ్ర స్థాయిలో వరద ముంచెత్తడంతో కొన్ని ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి. విద్యుత్ సరాఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడంతో దాదాపు 30 లక్షల మంది అంధకారంలో ఉన్నారు. ఫ్లోరిడా, జార్జియా, ఉత్తర, దక్షిణ కరోలినా, వర్జీనియాలో ఎక్కువగా మరణాలు సంభవించాయి. అట్లాంటాలో రికార్డు స్థాయిలో 28సెంమీల వర్షపాతం నమోదైంది.

# నిర్మలా సీతారామన్పై కేసు నమోదు

### ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

**బెంగళూరు, సెప్టెంబర్ 28 :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్కు కోర్టు షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్ల నేపథ్యంలో బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో నిర్మలా సీతారామన్పై కేసు నమోదు చేయాలని బెంగళూరులోని తిలక్ నగర్ పీఎస్ పోలీసులను ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. ఈ ఆరోపణల కారణంగా జ్ఞానదికార్ సంఘర్ష పరిషత్ సంస్థ సహా అధ్యక్షుడు అదర్ష్ అయ్యార్ తిలక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదు స్వీకరించేందుకు తిలక్ నగర్ పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గతేడాది ఏప్రిల్లో చట్టసభ ప్రతినిధుల కోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ఈ పిటిషన్పై శుక్రవారం కోర్టు విచారణ చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను అక్టోబర్ 10వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఈడీ ఉన్నతాధికారులు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కర్ణాటక బీజేపీ అగ్రనేతలు నళిని కుమార్ కతీల్, విజయేంద్రలకు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మనం

ఆదివారం | హైదరాబాద్
29 | 09 | 2024



# గంజాయి/మాదక ద్రవ్యాల వినియోగ నిర్మూలనే లక్ష్యం

- మిషన్ పరివర్తన్ వినూత్న కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు
- అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**నల్లగొండ,సెప్టెంబర్ 28(మనం ప్రతినిధి):** జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ నల్లగొండ జిల్లాను డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా జిల్లాలో జరుగుతున్న నేరాలపై సమగ్ర విశ్లేషణ చేసి వాటికి మూలమైన గంజాయిని సమూలంగా నిరోధించాలని దృఢ సంకల్పంతో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ మిషన్ పరివర్తన్ అనే వినూత్న కార్యక్రమం చేపట్టి గంజాయి రహిత నల్లగొండగా తీర్చిదిద్దాలని గంజాయి అక్రమ రవాణా,విక్రయం మరియు వినియోగంపై దృష్టి సారించి జిల్లా సరిహద్దు మార్గాలలో మరియు అంతరాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి పై గట్టి నిఘా పెట్టి కట్టడి చేయడం జరిగింది. ప్రతి పోలీసు స్టేషన్ పరిదిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల మాదిరిగా గాంజా టెస్టింగ్ కిట్లు ద్వారా టెస్టుల చాలా మందికి టెస్టులు చేయగా వీరిలో గంజాయి సేవించి పట్టుబడిన దాదాపు 327 మంది పట్టుబడ్డారు. వీరందరికి సైకియాట్రిస్ట్ డాక్టర్ల ద్వారా గాంజా సేవించడం వల్ల కలిగే అనర్థాలు నష్టాలు, ఆర్థిక, ఆరోగ్యం పై పడే ప్రభావంల గురించి వారిలో మార్పు తీసుకురావడం కొరకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి మళ్ళీ వీరందరికి రెండవ సారి పరీక్ష నిర్వహించగా 321 మందికి నెగిటివ్ వచ్చింది. మిగతా 6 గురికి మాత్రమే పాజిటివ్ రాగా వీరికి కామినేని హాస్పిటల్ నందు డి అడిక్షన్ సెంటర్ కి పంపి ట్రీట్మెంట్ మరియు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది.

మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో బాగంగా నల్లగొండ జిల్లాను గంజాయి/మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు:-

### గంజాయి/మాదకద్రవ్యాల పైన అవగాహన సదస్సు.

మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో బాగంగా గంజాయి/మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు నష్టాలు,దుష్పరిణామాలపై షార్ట్ ఫిల్మ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 471 పాఠశాలలు, కళాశాలలో దాదాపు 20 వేల మంది విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది.

### గంజాయి వినియోగదారులు పైన నిఘా

గంజాయి వినియోగదారులు/ చిరు వ్యాపారులు పైన నిఘా పెడతూ, 327 మందిని పట్టుకొని వారిలో అలవాటుగా వ్యాపారం చేస్తూ సరఫరా చేసే 21 మంది పైన కేసు నమోదు చేసి జైలుకి తరలించి హిస్టరీ షీట్ ఓపెన్ చేయడం జరిగింది.

### విలేజ్ పోలీసు ఆఫీసర్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన

జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో గంజాయి వినియోగం పై కలిగే నష్టాలు పైన జిల్లాలోని ఇప్పటి వరకు 1783 గ్రామాలలో సందర్చించి పాఠశాలు విద్యార్థులకు మరియు ప్రజలకు పోలీసు కళా బృందాల ద్వారా, వీడియోలు, వాల్ పోస్టర్స్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది.గంజాయి అక్రమ రవాణా పైన ఉక్కుపాదం జనవరి 2024 నుండి ఇప్పటివరకు 31 కేసులలో 131 మందిని జైలుకి తరలించి ఒక కోటి తొంబై లక్షల విలవ గల 771 కేజీల గంజాయిని సీజ్ చేయడం జరిగింది. అంతే కాకుండా గతం లో సీజ్ చేసిన గంజాయి ని జిల్లా డ్రగ్ డిస్ట్రక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 5036 కేజీల గంజాయి ని నిర్వీర్యం చేయడం జరిగింది.

# జీవో నెంబర్ 25ను రద్దు చేయాలి

- గడియారం సెంటర్ వద్ద యూఎస్పీసి నిరసన నిరసన



**నల్గొండ, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** నల్లగొండ జిల్లా గడియారం సెంటర్ వద్ద యూఎస్పీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ జి.ఓ.యంయస్ నెం. 25 ను గతములో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించడము వలన నిలుపుదల చేసినారు. ప్రస్తుతం సర్దుబాటు నిమిత్తం విడుదల చేసిన ఆర్సి నెం.1267 ఉత్తర్వులు కూడా శాస్త్రీయంగా లేవని అభిప్రాయ పడుతూ, ఇట్టి ఉత్తర్వులను సవరణ చేసి బోధనకు ఆటంకం లేకుండా సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని, తరగతికి ఒక గది, గదికొక ఉపాధ్యాయుడు ఉండాలని మీరు చెప్పిన నిబంధనలను అమలుచేయక పోవటాన్ని యుయసిపిసి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. 11 మంది విద్యార్థులున్నా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరు ఉపాధ్యాయులే అనడం అసంబద్ధంగా ఉన్నది. పాఠశాల వ్యవస్థలో సరిపోయే ఉపాధ్యాయులు ఉన్నప్పటికినీ అస్తవ్యస్త విధానం వలన విద్య కుంటుపడుతున్నది. విద్యా ప్రమాణాలు కూడా మరింత దెబ్బతినే అవకాశమున్నది. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ జీవోను సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా (యూఎస్పిసి) మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా, 20 మందికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో ఒకసెక్షన్కు ఒక పాటర్న్ చొప్పున ఉండు విధంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పిసి) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం నల్లగొండ గడి యారం సెంటర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించనైనది. జీ వో నెంబర్ 25న సవరించాలని కోరుతూ యూఎస్పీసీ నుండి నల్లగొండ జిల్లా కలెక్టర్కు మెమొరం నమ్మును సమర్పించారు. ఉపాధ్యాయుల ఆందోళనను ప్రభుత్వానికి నివేదించి ఈ క్రింది సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో(యూఎస్పిసి) నాయకులు ఎడ్ల సైదులు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రత్తయ్య టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎండి పురుషీద్ భయ్యా ఎటిఎం జిల్లా అధ్యక్షులు తోపాటు పి వెంకలు, నర్రా శేఖర్ రెడ్డి, రత్తయ్య, రామదాసు, ఏడుకొండలు జిహెచ్ఎం మంగళ నాయక్, వరలక్ష్మి, జగతి, జె.రమణమ్మ, గేర నర సింహ, ఎం శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, ఫిరోజ్ షేర్ బుక్, వెంకటేశ్వర్లు, కే వీరయ్య అంజయ్య, సత్యం, శ్యామ్, మధుసూదన్, వివిధ రంగాల మండల బాధ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్సీ మల్లన్న

- విద్యార్థుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తా
- ఎమ్మెల్సీ మల్లన్న



**యాదగిరిగుట్ట,సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** యాదగిరిగుట్ట ప్రభుత్వ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీన్మార్ మల్లన్న ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని ప్రతి గదిని పరిశీలించారు, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణానికి ప్రభుత్వ కళాశాల దూరంగా ఉందని విద్యార్థులకు ఉదయము సాయంత్రము బస్ సౌకర్యం కావాలని తెలిపినారని, కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని విద్యార్థిని విద్యార్థులు కోరినారని వారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పి మంజుల, ఎన్ఎస్ఎస్ అధికారి పి రాంబాబు, అధ్యాపకులు అసహిల్, రాజు,రమేష్,కృష్ణ, బలరాం, హైమావతి,నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, రమేష్, అనిత నరసింహా రజిత తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక




**చింతలపాలెం, సెప్టెంబర్ 28 ( మనం న్యూస్):** చింతలపాలెం మండలంలో యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం డివిజన్ ఆఫీస్ కోదాడలో సంఘ సమావేశంలో ఎన్నుకున్నారు. చింతలపాలెం మండల టి ఎస్ యుటి ఎఫ్ సంఘ అధ్యక్షుడిగా జి సైదులు ఎంపీ పీ ఎస్ చింతలపాలెం, ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాస్ జడ్.పి.హెచ్ యస్ దొండపాడు, ఉపాధ్యక్షులుగా అలీ జడ్పీహెచ్ఎస్ చింతలపాలెం, మహిళా ఉపాధ్యక్షురాలు ఎన్ .విజయలక్ష్మి యుపిఎస్ కిష్టాపురం, కోశాధికారిగా హర్షవర్ధన్ రాజు,ఎప్ దయు ఎప్ కన్వీనర్ సి హెచ్ బ్రహ్మయ్య ఎంపీ పీ ఎస్ శోభనాద్రి గూడెం, ప్రభాకర్. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు సీనియర్ టీఎస్ యూటీఎఫ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ప్రమాణం స్వీకారం చేశారు.

# రేబిస్ రహిత ప్రపంచమే లక్ష్యంగా ప్రపంచ రేబిస్ దినోత్సవం వేడుకలు

- విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన సదస్సు
- కోదాడ ప్రాంతీయపశువైద్యశాలలో కుక్కలకి ఉచిత రేబిస్ టీకాలు
- కోదాడలో వీది కుక్కల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో త్వరలో కుక్కల పునరావాస కేంద్రం ఏర్పాటు




**కోదాడ, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** కోదాడ పట్టణం క్రాంతి ది ఫౌండేషన్ పాఠశాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకి అవగాహన సదస్సు నిర్వహించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 4000 సంవత్సరాల క్రితమే రేబిస్ వ్యాధి గుర్తించినా 1885 లో తొలిసారిగా ఈ వ్యాధికి టీకాలు కనుక్కోవడం జరిగిందని కాలక్రమేణా మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తొలుత నాభి చుట్టూ 14 ఇంజక్షన్లు వేసే స్థితి నుండి నేడు నెలరోజుల కాల వ్యవధిలో 5 టీకాలు సాధారణ ఇంజక్షన్ల వలె తీసుకుంటే కుక్క కరిచినా రేబిస్ గురించి భయపడాల్సిన అవసరం లేదు అన్నారు.ఒకే దేశం ఒక ఆరోగ్యం నినాదంతో సాంక్రమిక వ్యాధుల నివారణకు గాను ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుంది అందులో భాగంగా వీది కుక్కల నివారణకు నగరాలు మున్సిపాలిటీల్లో కుక్కల పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేసి కుక్కలకి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ద్వారా సంతతిని నిరోధిస్తూ ఉన్న వాటికి టీకాలు వేయించి పట్టణంలో కుక్కలబెడదలేకుండా మున్సిపాలిటీ ప్రణాళిక చేస్తుంది అన్నారు.పెంపుడు కుక్కలు పిల్లులకి ఖచ్చితంగా మూడు మాసాల వయస్సురాగానే రేబిస్ నివారణ టీకాలు వేయించడం ద్వారా జంతువులు యజమానులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.విద్యార్థుల్లో పోరాట శక్తి పెద్దల్ని ఒప్పించే ప్రతిభ మెండుగా ఉంటుందని రేబిస్ నివారణపై ఇచ్చే సూచనలు తమ కుటుంబ సభ్యులు బంధువులు వాడలోని వారితో చర్చించి ఆచరింపచేయించడం ద్వారా రేబిస్ నియంత్రనలో భాగస్వాములవ్వాలని సూచించారు.కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోదాడ మున్సిపాలిటీలో వీది కుక్కల శాశ్వత నివారణకు ఎకరం బూమి కేటాయించి కుక్కల పునరావాసకేంద్రం ఏర్పాటుకి పనులు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు.క్రాంతి ఫౌండేషన్ స్కూల్ ఫౌండర్ చైర్మన్,ప్రిన్సిపాల్ రాపోలు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు వివిధకారణాలతో వ్యాపకంగా పెంపుడు జంతువులను సాకుతున్నారని, వాటితో ఆహ్లాదంతో పాటు రోగాలు పొంచి ఉన్నందున అట్టి రోగాలు నివారణకు అవగాహన ఎంతో అవసరం అని ఆరోగ్య సమాజానికి ఎప్పటికప్పుడు పిల్లల అవగాహన అత్యంతముఖ్యమని ఇలాంటి మంచి కార్యక్తమాన్ని తమ పాఠశాలలో నిర్వహించినందులకు సంతోషం వెలిబుచ్చి మున్సిపాలిటీ లో వీది కుక్కల నివారణకు ప్రయత్నిస్తున్న మున్సిపాలిటీ కౌన్సిలర్స్‌ని ఘనంగా సన్మానించారు.అనంతరం ప్రాంతీయపశువైద్యశాలలో నిర్వహించిన ఉచిత రేబిస్ నివారణ టీకా కార్యక్రమములో రేబిస్ టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లు,తిప్పిరిశెట్టి రాజు,ప్రిన్సిపల్ రాపోలు శ్రీనివాస్, సిబ్బంది చ్నద్రకళ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వివరాలను పరిశీలిస్తూ క్వాలిటీతో వేగంగా పరిష్కరించాలి

- భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా వాల్టా చట్టంపై అవగాహన చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే



**భువనగిరి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** శనివారం నాడు కాన్ఫరెన్స్ హాలులో ఆయన రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లతో ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వాల్టా చట్టంపై సమీక్షించారు. ధరణి ఫైళ్ల పరిష్కారం క్వాలిటీతో పూర్తి కావాలని, మీయొక్క రిమార్కులు, రికమెండేషన్లు క్లియర్‌గా ఉండాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన సర్టిఫికెట్లతో ఫైల్స్ సర్క్యులేట్ చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీ విషయంలో పెండింగ్ లేకుండా చూడాలని, ప్రజలకు, విద్యార్థులకు కావలసిన పత్రాల జారీలో ఎలాంటి అలసత్వం, ఆలస్యం కావద్దని, కింది స్థాయి సిబ్బంది పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి ప్రజాభవన్ నుండి వచ్చిన ప్రజల సమస్యలను, జిల్లా స్థాయిలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను నిబంధనల ప్రకారం తక్షణ పరిష్కారం చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూడాలన్నారు. మండలాలలో కొత్తగా గుర్తించిన విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం, అలాగే ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సబ్ సెంటర్ల కోసం స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ వాల్టా చట్టంపై గ్రామాలు, అర్బన్ ప్రాంతాలలో అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణ దిశగా 2002 సంవత్సరంలో వచ్చిన వాల్టా చట్టం ననుసరించి వ్యవసాయం, పరిశ్రమలు, ఇండ్ల అవసరాలు, కమర్షియల్ అవసరాలకు బోరుబావులు వేయాలంటే తప్పనిసరి అనుమతులు పొందాలని, గ్రామాలకు సంబంధించి తహశీలుదారు, అర్బన్ స్థాయిలో మున్సిపల్ కమీషనర్ల నుండి అనుమతులు పొందాలని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణ, రీఛార్జీ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, బోర్లు వేయాలంటే అన్లైన్ ద్వారా అనుమతులు పొందాలని, పరిశ్రమలకు, కమర్షియల్ అవసరాలకు ఛార్జ్ చేయడం జరుగుతుందని, అలాగే బోరు రిగ్గులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని, అనధికార డ్రిల్లింగులను అరికట్టాలని తెలిపారు. పరిశ్రమలు, అపార్ట్మెంట్లలో నీటి వినియోగం నిబంధనల మేరకు నడుచుకోవాలని, నీరు వాడుకునే విధానంపై నియంత్రణ ఉండాలని, అవసరమైన రుసుము ప్రభుత్వానికి జమ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందేర్, చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్లు అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవితల పోటీ

- దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి
- కరపత్రం ఆవిష్కరించిన డాక్టర్ కృష్ణ కౌండిన్య



**నలగొండ,సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్గొండ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య తెలిపారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో నల్గొండలోని ఎన్జీ కళాశాల ఆవరణలో దశాబ్ది ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ కౌండిన్య, సంఘం అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలుగులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ సాహితి కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు రచనల పట్ల, కవిత్వం పట్ల, సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగించి భవిష్యత్తులో ఉత్తమ రచయితలుగా, కవులుగా తీర్చిదిద్దేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ పోటీలకు కవితలను సునిషిత ప్రేమ భావన, స్నేహం, తల్లిదండ్రుల అనురాగం, పర్యావరణం, ఇతర సామాజిక అంశాలను తీసుకొని ఏదైనా ఒక అంశంపై కవిత రాయాలన్నారు. ఉత్తమ కవితలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు ప్రోత్సాహక బహుమతులతో పాటు సత్కారాలు ఉంటాయన్నారు. ఈ కవితలను పంపడానికి ఆఖరి తేదీ 20 .10. 2024. కవితలను టిఈఎల్ఏఎన్జిఏఎన్ఏఎస్ఏహెచ్ఐటిహెచ్ఐఎన్ఎల్జి2024ఎట్ దడేట్ జీఓంఎఐఎల్.సీఓఎం మెయిల్ కు పంపాలని కోరారు. విజేతలకు నవంబర్ 3 తేదీన నల్గొండలో జరిగే దశాబ్ది ఉత్సవాలలో బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9848228004, 99123 59345, 99080 59234 ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహమ్మద్, సహాయ కార్యదర్శి పి. మట్టయ్య, గ్యార నరసింహ, లింగమూర్తి, ఎం లింగస్వామి, పెరుమాళ్ళ ఆనంద్, సాగర్ల సత్తయ్య, పీ నరసింహ, దాసోజు జ్ఞానేశ్వర్ , శ్రీనివాస్ రవికుమార్, లక్కర్ల మధు ,రఘువరన్ రజనీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లతీఫ్ సాబ్ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



**నల్లగొండ,సెప్టెంబర్ 28(మనం ప్రతినిధి) :** అక్టోబర్ 17వ తేదీ నుండి నిర్వహించే లతీఫ్ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనల్గొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ దామన్ దర్గా ప్రాంగణంలో ఉర్సు కమిటీ వారు ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా నల్గొండ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు .అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని ఎంతో ఘననీయమైన చరిత్ర గల సయ్యద్ లతీఫ్ షా వలి ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకో వాలని ఉరుసు కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నల్లగొండ మున్సిపాలిటీ సహకరిస్తుందని తెలిపారు.దర్గా మరమ్మత్తుల కొరకు దాదాపు తొమ్మిది లక్షలు వరకు కేటాయించడం జరిగిందని తెలిపారు.. కుల మతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సు ను పట్టణం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి అధిక జనసాంద్రత వస్తుందని వచ్చిన వారికి ఎటువంటి లోటు లేకుండా అన్ని విధాలుగా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 17 న ఉత్సవాలు ప్రారంభమవుతాయని. దాదాపు 30 రోజులు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని స్థానిక మదీనా మసీదు నుంచి గంధం ను నల్లగొండ పలు ప్రాంతాలలో ఊరేగింపు జరుగుతుందని.. అనంతరం దర్గా కు సమర్పించి ఉత్సవాలు జరుగుతాయని తెలియజేశారు. పట్టణ ప్రజలు కుల మతాలకు అతీతంగా పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాల్సిందిగా తెలియజేశారు.

నల్లగొండ వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ , స్థానిక కౌన్సిలర్ నవీన్ గౌడ్, కౌన్సిలర్లు సయ్యద్ సమద్, ఫసాద్ అలీ బాబా, మహబూబ్ ఆలీ(ఇంతియాజ్) , కొమ్ము శంకర్, సిపిఎం లీడర్ సయ్యద్ హాషం, ఉర్సు కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ జాఫర్, ఇంతియాజ్ హుస్సేన్, మిలాద్ కమిటీ ప్రెసిడెంట్ మసీఉద్దీన్ అడ్వకేట్, ఎక్స్ ఉర్దూ అకాడమీ మెంబర్ బాబా జీయా యావుద్దీన్, ముతవల్లీలు సయ్యద్ రషీద్ ఖాద్రి, సయ్యద్ సమీ ఉల్లా ఖాద్రి, గాస్ ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, తబ్రేజ్ ఖాద్రి, ఓవైస్ ఖాద్రి, సుఫియాన్ ఖాద్రీ, మరియు కమిటీ సభ్యులు మొహమ్మద్ ఫెరోజ్ అలీ, మొహమ్మద్ నసీర్, మహమ్మద్ ఆరిఫ్, ఉర్సు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా విజయవంతం

- పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ఖమ్మం, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** యువత ప్రయాణంలో నేటి మెగా జాబ్ మేళా తొలి అడుగు మాత్రమేనని, ఈ రోజు వచ్చే ఉద్యోగం చేస్తూ జీవితంలో మరింత ఉన్నత స్థితికి చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక ఎస్.ఆర్. బి.జీ.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. మెగా జాబ్ మేళా కార్యక్రమంలో 18 కంపెనీలకు పైగా పాల్గొంటూ నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సుమారు 1500 వరకు నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలో పాల్గొనేందుకు వచ్చినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఆఫర్ లెటర్ లను అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, చదువు పూర్తి చేసుకొని ఉద్యోగాల వేటలో ఉన్న యువకుల ప్రయాణంలో నేడు జరిగే జాబ్ మేళా మొదటి అడుగు మాత్రమే కావాలని అన్నారు. మనల్ని మనం ఎప్పుడూ తక్కువగా అంచనా వేసుకోవద్దని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్క యువతి/యువకుడు ఆకాశమంత సాధించే అవకాశం ఉంటుందని, మనం దృష్టి ఎంత పెడితే అంత సాధిస్తామని అన్నారు.జీవితంలో మనం ముందు చిన్న ఉద్యోగంతో ప్రారంభించిన తర్వాత ఎదిగేందుకు గల అవకాశాలను సృష్టించుకుని జీవితంలో ఎదగాలని కలెక్టర్ సూచించారు. యువత పెద్ద లక్ష్యాలను నిర్దేశించించుకోవాలని, దాని సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. మన లక్ష్య సాధనలో అనేక సార్లు మనం వైఫల్యం చెందవచ్చని, వాటికి నిరుత్సాహ పడకుండా మళ్ళీ ప్రయత్నించాలని అన్నారు. వైఫల్యం పొందటం పట్ల యువత భయం వదిలి వేయాలని కలెక్టర్ తెలిపారు. అమెరికా దేశ అధ్యక్షుడిగా ఎన్నికై మంచి సేవలు అందించి చరిత్రలో శాశ్వతంగా స్థానం పొందిన అబ్రహం లింకన్ అనేక సార్లు వైఫల్యం పొందారని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ యువతకు సూచించారు. పోటీ పరీక్షల్లో పాల్గొనే పిల్లలకు గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాల ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రీజనల్ ఉపాధి అధికారి రవీందర్, జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి, ఎస్.ఆర్.బి.జీ.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాల, ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపాల్ లు శ్రీనివాస్, రామకృష్ణ లు, జూనియర్ ఉపాధి అధికారి నిర్మల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విహార యాత్రలతో విజ్ఞానంతో పాటు మానసిక ఉల్లాసం

- జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి
- మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో పులిగుండాలకు విహార యాత్ర




**ఖమ్మం, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** విహార యాత్రలతో విజ్ఞానం తోపాటు, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి అన్నారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో జిల్లాలోని పులిగుండాల అభయారణ్యం విహార యాత్రలో టూరిజం అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారి మాట్లాడుతూ, ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని, పచ్చని కొండలు, చిక్కని అటవీ ప్రాంతం, ఆహ్లాదకరమైన వాతావరణానికి తోడు పక్షుల కిలకిలరావాలతో సందడిగా వుండే పులిగుండాల ప్రాజెక్టు సందర్శనగా విహార యాత్ర శనివారం చేపట్టినట్లు తెలిపారు. పెనుబల్లి మండలం బ్రాహ్మళకుంట గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో గిరిజన రైతుల భూములు సాగు అవసరాల నిమిత్తం కొండల నడుమ పులిగుండాల సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, పులిగుండాల ప్రత్యేకతల గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ ప్రాజెక్టు కొండల నడుమ అటవీ ప్రాంతంలో ఉండడంతో సాగునీటి అవసరాలు తీరుస్తూనే, పర్యాటక కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతుందని పర్యాటక అధికారి తెలిపారు. విహార యాత్రలో ఎంతసేపు చూసినా తనివితీరని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, విద్యార్థినులు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. పద్మావతి, ఎన్ఎస్ఎస్ పిఓ జి. కుమార స్వామి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు శ్యామలాదేవి, శైలజ, గాయత్రి, సింధు, ఫారెస్ట్ బీట్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు




**ఖమ్మం టౌన్, సెప్టెంబర్ 28(మనం న్యూస్):** బతుకమ్మ పండుగ పురస్కరించుకుని.. శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. సాంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థినులు పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. ఆటపాటలతో పాఠశాల కోలాహలంగా మారాయి.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్ పర్సన్ నిషిత శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, నేటి తరం యువతకు బతుకమ్మ గురించి తెలుపవలిసిన అవసరం మనందరిపైన ఉన్నదని తెలిపారు. దసరా, బతుకమ్మల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినులు సంప్రదాయక బట్టలు ధరించి, వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# అడవిలో ఇక ఆధునిక వైద్యం

- సేవలందించేందుకు ముందుకు వచ్చిన సిఆర్‌పిఎఫ్
- రూ.2 కోట్లతో రెండు ఆసుపత్రుల నిర్మాణాలు
- పూర్తయిన చెన్నాపురం వైద్యశాల
- కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న సేవలు



**చర్ల, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** అవి మందు గోళీలు కూడా దొరకని కుగ్రామాలు, నిత్యం మావోయిస్టుల కదలికలు ఉండే ప్రాంతాలు. ఎటు చూసినా ఎత్తయిన గుట్టలు, దట్టమైన అడవులు. అలాటి గ్రామాల్లోని ఆదివాసీలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సిఆర్పిఎఫ్ 81 బాలగాలు ముందుకొచ్చాయి. సుమారు 2 కోట్ల వ్యయం తో వైద్య శాలలను నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఒక వైద్య శాల పనులు పూర్తి కాగా మారో వైద్య శాల పనులు ప్రారంభం కానున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం లోని ఆదివాసీల కోసం సి ఆర్ పి ఎఫ్ బాలగాలు నిర్మిస్తున్న ఆసుపత్రుల పై 'మనం' అందిస్తున్న ప్రత్యేక కథనం. తెలంగాణ – చత్తీస్గఢ్ సరిహద్దు, చర్ల మండలంలోని చెన్నాపురం, పూసుగుప్ప గ్రామాలలో పోలీస్ శాఖ ఆద్వర్యంలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల నిదులతో



ఆదునిక వసతులతో కూడిన వైద్యశాలలు నిర్మితమవుతున్నాయి. ముందుగా చర్ల మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో గల చెన్నాపురం గ్రామ సమీపంలోని సి ఆర్ పి ఎఫ్ 81 బేస్ క్యాంప్ వద్ద ఆదునిక వసతులతో వైద్యశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయింది. మినీ ఆపరేషన్ దియేటర్, ఆల్ట్రా స్కానింగ్ మిషన్, ఎక్స్ రే ప్లాంట్, అన్ని రకాల రక్త పరీక్షలు వంటి ఆదునిక వసతులతో వైద్య శాలను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అత్యంత ఆదునిక వసతులతో కూడిన అంబులెన్స్ సైతం అందుబాటులోకి రానుంది. వైద్యశాలలో సిఆర్‌పిఎఫ్ వైద్యుడు సేవలందించనున్నారు. ఆసుపత్రిలో నర్సింగ్ సేవలకు గాను సమీప గ్రామాలలో నర్సింగ్ చేసిన వారిని సిబ్బందిగా నియమించనున్నారు. మరో రెండు మూడు నెలలలో ఆదివాసుల వైద్య కష్టాలు తీరనున్నాయి. ఈ వైద్యశాలకు సమీపంలో తెలంగాణ, చత్తీస్గఢ్ రాష్ట్రం లకు చెందిన 50కి పైగా గ్రామాలు ఉండగా వాటిలో వేలాది మంది ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారు. వీరందరికి వైద్యం అందని ద్రాక్షే. అనారోగ్యంకు గురయితే 30 కిలోమీటర్ల లోని చర్ల, సత్యనారాయణపురం లేదా పామేడు వైద్యశాలలకు రావాల్సిఉంటుంది. రహదారి సౌకర్యాలు లేని గ్రామాల గిరిజనులు జెడ్డీ లతో కిలోమీటర్ల కొద్ది నడక సాగించి వైద్యశాలలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ నేపద్యంలో చెన్నాపురంలో వైద్య శాల నిర్మాణంతో గిరిజనుల కష్టాలు తీరనున్నాయి. గ్రామాలకు అంబులెన్స్ వెల్లి రోగులను వైద్యశాలకు తీసుకురానున్నాయి. రోగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అక్కడే చికిత్సలు అందించనున్నారు. మెరుగయిన వైద్యం అవసరమయిన వారిని పట్టణ ప్రాంత వైద్య శాలలకు తరలించి చికిత్సలు అందించనున్నారు. కళలో కూడా ఊహించని ఆదునిక వైద్యం తమ చేరువలోకి రావడంతో ఆదివాసీ గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆ మంచిరోజుల కొరకు ఆదివాసులు ఎదురు చూస్తున్నారు.

### కష్టాలు తీరనున్నాయి : మిడియం స్వామి, తిప్పాపురం



ఆధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం తమకు ఆనందాన్ని కలిగిస్తోంది. గతంలో అనారోగ్యంకు గురయితే 20 కిలోమీటర్ల దూరంలోని చర్ల వైద్యశాలకు వెల్లాల్సి వచ్చేది ఇకపై ఇటువంటి కష్టాలు ఉండవు

### గతంతో సరైన వైద్యం అందేది కాదు : కారం కన్నారావు, మాజీ సర్పంచ్, తిప్పాపురం



చెన్నాపురం వద్ద ఆధునిక వసతులతో వైద్యశాల నిర్మించడం సంతోషకరం. తెలంగాణ గ్రామాలతో పాటు చత్తీస్గఢ్ గ్రామాల గిరిజనులకు ఆదునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఇన్నాళ్లు ఇక్కడి ప్రజలకు సరైన వైద్యం అందేది కాదు. రహదారి సౌకర్యాలు లేక అంబులెన్స్‌లు వచ్చేవికావు. ఫలితంగా అనేకమంది మృత్యువాత పడేవారు. ఇకపై ఇటువంటి పరిస్థితి ఉండదు.

## పర్యావరణ సంరక్షణకు విద్యార్థులంతా ముందుకు రావాలి

- డిగ్రీ కళాశాలలో అవసరమైన వసతుల కల్పనకు కృషి
- పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల జాబితా అందించాలి
- విద్యార్థినులు ఆంగ్ల భాషపై పరిజ్ఞానం పెంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ఖమ్మం, సెప్టెంబర్ 28 (మనం బ్యూరో):** పర్యావరణ సంరక్షణకు విద్యార్థులంతా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. లూయీ పాశ్చర్ రేబిస్ వ్యాధి నివారణకు టీకా కనుగొన్నారని, ఆయన మరణించిన రోజును పురస్కరించుకొని ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని, దానికి సంబంధించిన అంశాలను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. వేణు మనోహర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రపంచంలో మానవుల స్పెసిస్ వచ్చి 4 లక్షల సంవత్సరాలు మాత్రమే అవుతుందని, భూమి గ్రహం దాదాపు 400 కోట్ల సంవత్సరాలకు పైగా ఉందని, మానవులు వచ్చి చాలా తక్కువ సమయం అయినప్పటికీ మన కారణంగా అనేక రకాల జాతులు అంతరించి పోతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. భూమిపై మనం ఉన్నంత కాలం, ఇతర జాతుల ఉనికికి ఇబ్బంది కలిగించకుండా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. వీధి కుక్కల దాడుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రేబీస్ వ్యాధి సోకకుండా కుక్కలకు టీకా అందిస్తున్నామని అన్నారు. కుక్కలు పెంచుకోవాలనుకునే వారు అడాప్ట్ చేసుకోవాలని, చూసుకునే ఆసక్తి సంపూర్ణంగా ఉంటేనే పెంచుకోవాలని, అనవసరంగా సరదా కోసం కుక్కలను తెచ్చుకొని కొన్ని రోజుల తర్వాత వదిలేయడం చేయవద్దని అన్నారు. విద్యార్థినులంతా పర్యావరణ సంరక్షణకు ముందుకు రావాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, రోజూ కొంత నడక అలవాటు చేసుకోవాలని అన్నారు. వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రంగా డిగ్రీ కళాశాల అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. డిగ్రీ కళాశాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థినులకు అవసరమైన మౌళిక వసతులు, సౌకర్యాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు మొదలగు వివరాలు, కళాశాలలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల జాబితా అందించాలని వెంటనే సరఫరా చేస్తామని కలెక్టర్ తెలిపారు. డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ లాంగ్వేజ్ కోర్సులు శిక్షణ అందించేందుకు అదనపు కంప్యూటర్, ప్రొజెక్టర్, ఆడిటోరియంలో చైర్, ఆడియో సిస్టమ్ మొదలగు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. హాస్టల్ లలో ఉన్న వసతుల, సమస్యలు గురించి తెలుసుకున్నారు. హాస్టల్‌లో టాయిలెట్లను పరిశుభ్రంగా నిర్వహించేందుకు సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని, ఉన్న టాయిలెట్ల మరమ్మత్తుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. హాస్టల్ లలో విద్యార్థినుల సంఖ్య పరిగణలోకి తీసుకుంటూ ప్రత్యేక ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేస్తామని అన్నారు. హస్టల్ లో భోజనం, వసతి బాగా లేదని ఎస్సి హాస్టల్ విద్యార్థినులు తెలుపగా, వాటిని పరిష్కరిస్తామని అన్నారు. హాస్టల్ కు వచ్చే బియ్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే విద్యార్థినులకు అందించాలని అన్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత ఉద్యోగాలు చేయాలనుకునే వారికి ఆంగ్ల పరిజ్ఞానం చాలా అవసరం ఉందని అన్నారు. ఒకే రోజు మనకు ఏ భాష రాదని, విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడటం ప్రారంభించాలని అన్నారు. విద్యార్థులకు స్పోకేన్ ఇంగ్లీష్ పై శిక్షణ అందిస్తామని అన్నారు. మనకు భాష తెలిసినా కూడా మాట్లాడకపోతే నమ్మకం రాదని, చిన్న చిన్న సంభాషణలు ఆంగ్లంలో చేయడం ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. తెలుగు సాహిత్యవేత్త గుర్రం జాషువా జయంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వేడుకలో కలెక్టర్ పాల్గొని గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాలలో ఆడిటోరియంను పరిశీలించి, కల్పించాల్సిన మౌళిక వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ ను జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. వేణు మనోహర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## విహారయాత్రను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- విహార యాత్రను ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** విహార యాత్రను విద్యార్థినులు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుండి పులిగుండాల అభయారణ్యం (కనకగిరి గుట్టలు) కు వెళుతున్న కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినీల విహార యాత్రను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకుంటామని, పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసుకోవడం, వాటి విశిష్టతను నలుగురికి తెలిపేందుకు భాగంగా విద్యార్థులను వైల్ లైఫ్ టూరిజం కు పంపుతున్నామని అన్నారు. మన దగ్గర ఉన్న అద్భుతమైన ప్రాంతాల విలువ మనం తెలుసుకోవాలని, మన జిల్లాలో ఉన్న కోట, చారిత్రక ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. నేడు విద్యార్థులు నేచురల్ టూరిజం క్రింద పులిగుండాల అభయారణ్యం (కనకగిరి గుట్టలు) వైల్ లైఫ్ పరిశీలనకు వెళ్తున్నారని అన్నారు. ఈ యాత్రను సంపూర్ణంగా వినియోగించు కోవాలని, యాత్ర నుంచి ఏం నేర్చుకున్నాం అనే అంశాలపై ప్రతి విద్యార్థిని రిపోర్ట్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణు మనోహర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి బి. సుమన్ చక్రవర్తి, ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్ రామకుమార స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- 5 సిసిఐ కేంద్రాలు, 10 జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు
- కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
- పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష




**ఖమ్మం, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** పత్తి పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వానాకాలం 2024-25 సీజన్ పత్తికొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 1,99,700 ఎకరాలలో పంట వేయడం జరిగిందని, 1,79,730 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి వస్తుందని అంచనాతో పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఖమ్మం జిల్లాలో 5 సిసిఐ కేంద్రాలు, 10 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. పొడవు పింజ రకం పత్తి పంట క్వింటాల్ కి 7521 రూపాయలు, మధ్య పింజ రకానికి 7121 రూపాయల మద్దతు ధర ప్రకటించామని, అక్టోబర్ రెండవ వారం నుంచి పత్తి పంట కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, పత్తి పంట కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్, అవసరమైన పరికరాలు, మొదలగు సౌకర్యాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రైతులు తాము పండించిన పత్తి పంట తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో ఉండే విధంగా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, పత్తి పంట తేమ శాతంపై కరపత్రాలు, మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సరైన ధర కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి ఎస్. విజయబాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి. అజయ్ కుమార్, విద్యుత్ శాఖ అధికారి సతీష్, సిసిఐ అధికారులు సతీష్, అవినాష్, యు.డి. తయాడే, జిన్నింగ్ మిల్లుల ప్రొప్రైటర్లు, కాటన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి. ప్రవీణ్ కుమార్, మోహిసిన్ సుల్తానా,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఉన్న వసతులను సంపూర్ణంగా వినియోగించుకోవాలి
- బాలికల చదువు పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- సుల్తానాబాద్ భూపతిపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్







**సుల్తానాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివే విద్యార్థినులు రాబోయే 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ భూపతి పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలిం చారు. పాఠశాల అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రీతి పల్లెపాటి, ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ రఘు వంశీ మెషిన్స్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ , తెలంగాణ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ , ప్రాజెక్టు మేనేజర్ మెర్సీ మేరి ఆధ్వర్యంలో కేజీబీవీలో నూతనంగా నిర్మించిన రూ.7 లక్షల విలువైన 10 అదనపు టాయిలెట్లను కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలె క్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కేజీబీవీలలో ఉన్న సదుపాయాలను వినియోగించుకుంటూ బాలికలు చదువులో రాణించాలని కలెక్టర్ అన్నారు. బాలికలకు అవసరమైన ఇతర సదుపాయాల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటామని, రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థిని మెరుగైన ప్రదర్శన కనబడుచాలని అన్నారు. కేజీబీవీలో ప్రతి విద్యార్థిని పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో పాస్ కావాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. కేజీబీవీలలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. కేజీబీవీలలో నూతనంగా నిర్మించిన టాయిలెట్లను శుభ్రంగా మెయింటైన్ చేయాలని అన్నారు. నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాల అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికల సౌకర్యార్థం 10 ఆదనపు టాయిలెట్లను నెలన్నర క్రితం ప్రారంభించి పూర్తి చేశామని అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివే బాలికలు అందుబాటులో ఉన్న సౌకర్యాలు వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రీతి పల్లెపాటి,తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్, ప్రాజెక్టు మేనేజర్ మెర్సి మేరీ, నిర్మాన్ ఆర్గనైజేషన్ సీనియర్ మేనేజర్ మహేష్ కుమార్, జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ కవిత, స్పెషల్ ఆఫీసర్ స్వప్న ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్ల అందజేత



**తిరుమలగిరి, సెప్టెంబర్ 28(మనం న్యూస్):** మండలంలో అనంతారం ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు శాగంటి సోమయ్య జ్ఞాపకార్థం 40 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. శాగంటి కుతురైన గారే మాధవిలత, సంపత్, కుమారుడైన చాగంటి మహేందర్, మహేష్, రమణాదేవి, సమ్మయ్యతో పాటు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 40మంది విద్యార్థిని విద్యార్థులకు సుమారు రూ. 5వేల విలువ గల ప్లేట్స్, గ్లాసులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయానికి మంచి వేదిక లోక్ అదాలత్



**తుంగతుర్తి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** పరస్పర రాజీమార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలంటే జాతీయ లోక్ అదాలత్ సరైన వేదిక అని జూనియర్ సివిల్ న్యాయ మూర్తి ఫర్హీన్ కౌసర శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీమార్గమే రాజ మార్గమని దీని ద్వారా అనేక కేసులు పరిష్కరించబడతాయని తెలియజేశారు. లోక్ అదాలత్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ పిలుపునిచ్చారు. తుంగతుర్తిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పంతాలకు పట్టింపులకు పోయి వైరుద్యాలను పెంచుకోవద్దని అన్నారు. లోక్ అదాలత్‌లో రాజిబడి కేసులు పరిష్కరించుకొని స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. దీని వలన ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యానారాయణ, లోక్ అదాలత్ సభ్యులు బానోత్ సతీష్, అనిల్‌కుమార్, కారింగుల వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, రాజారాం, రవికుఆర్, నాగరాజు, మహేష్, సిఐలు శ్రీనునాయక్, రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, కోర్టు సూపిరిటెండెంట్లు శ్రీనివాస్, అంజయ్య తదితులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా




**వీణవంక, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నెహ్రూ యువకేంద్రం,ఆదర్శ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరిగా బాధ్యతగా భావించి మన ఇంటిని ఏ విధంగా అయితే శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా దేశాన్ని పరిశుభ్రంగా ఉంచే దిశగా ప్రతి ఒక్కరు పనిచేయాలని అన్నారు. ప్రతి సంవత్సరంలో వంద గంటలు,ప్రతి వారానికి రెండు గంటలు చొప్పున శ్రమదానం చేయాలని,విధ్యార్థులు, యువతి యువకుల్లో స్ఫూర్తిని నింపేందుకు కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి,ఆదర్శఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చరణ్, విద్యార్థినాయకుడు అప్పని హరీష్‌వర్మ, లైబ్రేరియన్ రామ్మోహన్, అధ్యాపకు లు భాస్కర్, శోభన్‌బాబు, సుమలత, స్వప్న తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు చలన చిత్రం చిత్రీకరణ

**వీణవంక, సెప్టెంబర్28 (మనంన్యూస్):** మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు బతుకమ్మ పండుగ సంబురాలు అనే చలనచిత్రాన్ని చిత్రీకరిస్తున్నారని, ఈ చిత్రానికి ఘన్ముక్ల గ్రామ వాసులు కాంతాల వెంకట్‌రాజిరెడ్డి వ్యవహరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ దాచేపల్లి సత్యానారాయణ తెలిపారు. మహిళలు సద్దుల బతుకమ్మ పండుగ రోజు ఎలా తయారు అయి బతుకమ్మకు వెళ్తారో అదే విధంగా తయారై రావాలని, కోలాటం,కళాబృందాలు, గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## స్వచ్ఛత హీ సేవ అవగాహన కార్యక్రమం




**చండూరు, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** స్వచ్ఛ-భారత్ స్వచ్ఛ- తెలంగాణలో భాగంగా స్థానిక చండూరు మున్సి పాలిటీలోని సన్ షైన్ హై స్కూల్ నందు పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత ఈ సేవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. ప్రథమ బహుమతి స్నిఖిత, ద్వితీయ బహుమతి పార్థు నందిని సాధించారు. ఈ సందర్భంగా పాఠ శాల కరస్పాండెంట్ కోడి వెంకన్న విద్యార్థినీ విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనము గురించి వివరించారు. మన పరిసరాలు స్వచ్ఛంగా ఉండడం ద్వారా మన మనసు కూడా స్వచ్ఛంగా ఉండి మన పెరుగుదలకు మరియు ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు భారతదేశాన్ని స్వచ్ఛభారత్ గా మార్చుతామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులందరూ కలిసి భారతదేశాకారంలో మరియు స్వచ్ఛత హీ సేవ ( ఎస్‌హెచ్ఎస్ ) అక్షరమాల ఆకారంలో ఆసీనులైనారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మా, ప్రిన్సిపాల్ రవి కాంత్, మున్సిపాలిటీ అధికారులు అరవింద్, యాదయ్య, విజయలక్ష్మి మరియు లతీఫ్ పాషా ఉపాధ్యాయుని ఉపా . ద్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

- మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న




**చండూరు,సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** స్థానిక చండూర్ పట్టణం నందు చండూర్ మున్సిపాలిటీ వారు నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ -2024 కార్యక్రమంలో భాగంగా నిర్వహించినటువంటి వ్యాసరచన పోటీలలో కృష్ణవేణి పాఠశాలకు చెందిన కే. గీత మొదటి స్థానం మరియు కే శివ గణేష్ రెండవ స్థానం సాధించారు.గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను చండూర్ మునిసిపాలిటీ ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మరియు కౌన్సిలర్లు విద్యార్థిని, విద్యార్థులకు జ్ఞాపికలను అందించి అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల వ్యవహర్త జి చంద్రశేఖర్ మరియు ప్రిన్సిపల్ ఎస్కే మహబూబ్ అలీ, వైస్ ప్రిన్సిపల్ మిల్కీ రాజు పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

# పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా అభివృద్ధి

- పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఎం.డి. ప్రకాశ్ రెడ్డి
- ఖమ్మం ఖిల్లా రోప్ వే ప్రతిపాదనల రూపకల్పన
- జాఫర్ బావిని కలెక్టర్ తో కలిసి పరిశీలించిన ఎం.డి

**ఖమ్మంటౌన్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్ వే, జాఫర్ బావితో ఖమ్మం ఖిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఎం.డి. ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం ఖిల్లా రోప్ వే ప్రతిపాదన స్థలాన్ని, జాఫర్ బావిని పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎం.డి. ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్ వే ఏర్పాటుకు అనువుగా ఉండే ప్రాంతంపై చర్చించారు. ఎక్విప్మెంట్, ఖమ్మం ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాటుపై స్థలం లభ్యతపై ఎం.డి. చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇళ్లపై నుండి వెళ్లే విధంగా కాకుండా ఓపెన్ ప్లేస్ నుండి రోప్ వే ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. అంతకుముందు జాఫర్ బావిని, బావి



వైపు జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శేక్ హమీద్ పాషకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

**భువనగిరి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ డైరెక్టర్ శేక్ హమీద్ పాష ను గౌరవ డాక్టరేట్ వరించింది. గత 20 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా కొనసాగుతూనే సామాజిక సేవారంగంలో తాను చేస్తున్న కృషిని గుర్తించి తమిళనాడుకు చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయనను గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. శనివారం తమిళనాడులోని హోసూర్ లో నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా హమీద్ పాష మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందజేయడం ఆనందంగా ఉంది అన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ప్రజలతో మమేకమై పర్యావరణంతో పాటు విద్యార్థులకు, యువకులకు సిపిఆర్ మీద అవగాహన కల్పించి, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఫౌండర్ హెడ్ కోచ్ మాస్టర్ వి బాబు విజయన్, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె ఏ మనోకరన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జ్ డాక్టర్ జె హరిదాస్, వైదేహి ఇన్స్టిట్యూట్ ఆఫ్ కారిడాల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ బి దుర్గాప్రసాద్ రెడ్డి, కెపిసిసి నేషనల్



వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కేశవ ప్రసాద్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ చేరాల ప్రకాష్, ఆల్ ఇండియా జర్నలిస్ట్ రైట్స్ పార్లమెంట్ ఫోరం ఢిల్లీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగానికి ప్రభుత్వం చేయూతనిస్తుంది



**గుండాల,సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ చేయూతను అందిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ అధికారి ఎండి కామిల్ తెలిపారు శనివారం రోజున మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో ఆ సంఘం 31వ వార్షిక సర్వసభ్య సమావేశం చేనేత సంఘం అధ్యక్షుడు దుడక ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడి పాల్గొని మాట్లాడుతూ చేనేత కార్మికుల కృషి పాలకవర్గం పట్టుదల ద్వారా గుండాల చేనేత సహకార సంఘం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలబడి లాభాల బాటలో నడుస్తుందని అన్నారు ప్రభుత్వ పథకము తృప్తు నూలు సబ్సిడీ ద్వారా కార్మికులకు నగదు సహాయము అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఓ శ్రీనివాస్,పాసికంటి లక్ష్మీనారాయణ, చిందం ప్రకాష్ ,చుంచు యాదగిరి, శ్రీపతి సత్యనారాయణ, ఏలే కృష్ణ ,హరి కూరపాటి రవి, చుంచు నరసమ్మ ,దుడక సత్యనారాయణ, దోర్నం రమేష్ ,గోపాల్ చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# కాందిశీకుల భూములు, ప్రభుత్వ భూములు అటవీ భూముల పరిశీలన

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ

**తిరుమలగిరి(సాగర్) సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మండలంలోని భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా వివిధ సర్వే నెంబర్ 12, 14, 28, 60, 222, లో కాంధిశీకుల భూములు, ప్రభుత్వ భూములు, అటవీ భూములను శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఏభూములైన కాస్తూ, ఖబ్జా లో ఉన్నా రైతులందరికి పట్టాలు అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు చేసిన భూ సర్వే గురించి చర్చించి, చేయని సర్వే నెంబర్ లో ఎంజాయ్ మెంట్ సర్వే చేయాలని సర్వేయర్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాధ సుబ్రమణ్య, ల్యాండ్ రికార్డు ఏడి శ్రీనివాస్, డి ఐ రమణయ్య, యువజన కాంగ్రెస్ నేత మేరావత్ మునినాయక్, శ్రీను నాయక్, పరమేష్ నాయక్, బిచ్యాలు నాయక్, పలువురు సర్వేయర్ లు రైతులు



తదితరులు పాల్గొన్నారు.

మనం



# బొగ్గుల వాగు ప్రాజెక్టు పరిశీలన

**మల్హర్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగమైన బొగ్గుల వాగు ప్రాజెక్టును కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బొగ్గులవాగు ప్రాజెక్ట్ నీటిని నింపేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం మలహార్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. పాత రుద్రారం ఊర చెరువు విస్తరణ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఊర చెరువు నుండి బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు అనుసంధానం చేస్తూ నీటిని తరలించేందుకు ఇరిగేషన్, అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి రుద్రారం ఊర చెరువుకు, ఊర చెరువు నుండి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కు నీటిని తరలించేందుకు కాలువలు, ఎత్తిపోతల అవసరతపై అధికారులు సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. బొగ్గులవాగు ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారిత ప్రాజెక్టు అని, అలాకాకుండా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నదిజలాల ను



బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు తరలించడం ద్వారా బొగ్గుల వాగు ప్రాజెక్టు కింద అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. అనంతరం తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల ఘనిని పరిశీలించి తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ నుండి గణపురం మండలం చెల్పూరు కేటిపిపి కి బొగ్గును తరలించడానికి ఏర్పాటు చేయబోయే కన్వేయర్ బెల్ట్ గురించి జెన్కో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల గని నుండి చెల్పూర్ కేటిపిపికి ప్రస్తుతం 68 కిలోమీటర్ల దూరం ఉంటుందని కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయడం వల్ల 17.2 కిలోమీటర్ల దూరం మాత్రమే వస్తుందని రవనాభారం తగ్గుతుందని తెలిపారు. అంతకు ముందు తాడిచర్ల ఎస్సి కాలనీ ఆర్ అండ్ ఆర్ స్థలాన్ని పరిశీలించారు. తదపరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పి.ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. జూనియర్ కళాశాలలో ఫ్లోర్ మొత్తం దెబ్బ తిన్నదని మరమ్మతులు నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అసంపూర్తిగా నున్న కిచెన్ షెడ్ పూర్తి చేయుటకు అలాగే కళాశాల ప్రారంభం నుండి లోపలి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ సిద్దయ్య, తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**మల్హర్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరు కోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం ఆయన మండలంలోని రుద్రారం ఎంపిపిఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారితో ఇంగ్లీష్ పాఠాలు చదివించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థులు ఆంగ్ల పాఠాలు చక్కగా చదవడం పట్ల అభినందించారు. విద్యార్థులు. మంచిగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టిన మరమ్మతు పనులు, మంచినీటి సౌకర్యం, హ్యాండ్ వాష్, డిజిటల్ విద్యా బోధన వంటి అంశాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులు నెల నెలా వేతనాలు చెల్లింపుతో పాటు, గ్యాస్ మంజూరు చేయాలని కోరగా తగు చర్యలు తీసుకుంటాని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉపకరణాల గుర్తింపు శిబిరం



**చిట్యాల, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మండల కేంద్రంలో మహిళా ,శిశు,,దివ్యంగులువయోవృద్ధుల, ట్రాన్స్జెండర్స్ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు సహాయ ఉపకరణముల గుర్తింపు శిబిరం నిర్వహించారు.ఇట్టి శిబిరమునకు భూపాల్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై ఉపకరణముల శిబిరమును ప్రారంభించి చిట్యాల, టేకుమట్ల, మొగుల్లపల్లి మండలాలకు సంబంధించిన దివ్యాంగ సోదరీ సోదరీమణులకు అర్హులైన వారందరికీ గుర్తించి వారికి ఉచితంగా ఉపకరణములు మూడు నెలలలో ఇప్పిస్తామని తెలిపియున్నారు. ఇట్టి శిబిరమునకు మొత్తం 500 దివ్యంగులు హాజరు అయినారు . వారిలో చిట్యాల మండలం – 77 టేకుమట్ల –67 మొగుళ్ల పెల్లి– 67 మొత్తం 211 దరఖాస్తులు రావడం జరిగింది ఇట్టి దరఖాస్తులన్నీ ఆన్లైన్లో పొందుపరిచి అర్హులైన అందరికీ ఉపకరణాలు ఇప్పిస్తామనీ తెలిపి ఉన్నారు ఈ సమావేశానికి తహసిల్దారు హేమ ప్రజా ప్రతినిధులు, సిడిపిఓ అవంతి, అంగన్వాడీ టీచర్ జ్యోతి ఇతర టీచర్స్ ఐసిపిఎస్ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్ మహిళా శక్తి సిబ్బంది హాజరైనారు.

## వాహనాల తనిఖీ



**మహాదేవపూర్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మహాదేవపూర్ మండల కేంద్రంలో శ్రీపాద చౌక్ వద్ద మహాదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్ ఆధ్వర్యంలోసాయంత్రం వాహన తనిఖీ లు చేపట్టారు.వాహన పత్రాలతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. సరియైన పత్రాలు లేనివాటికి జరిమానాలు విధించారు.రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. వాహన చోదకులు ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా వ్యవహారించాలని సూచించారు.ఈ తనిఖీల్లో స్థానిక సిబ్బంది కిషన్ చంద్రమోహన్ తో పాటు టి జి పి ఎస్ సిబ్బంది వున్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈవో



**తిరుమలగిరి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ఏ టు పరీక్షలు రాస్తున్న విద్యార్దుల పేపర్లు పరిశీలించి విద్యార్దుల బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించడానికి తగు సూచనలు చేశారు. మోడల్ స్కూల్ను సందర్శించారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో నిర్వహించబడుతున్న జాలి ఫోనిక్స్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ క్లాసులను పరిశీలించారు. వీరి వెంట మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, మండల నోడల్ అధికారి దామర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువ కిశోరం పన్యాల జైపాల్ రెడ్డి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** నేటి యువతకు పన్యాల జైపాల్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు అని తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, కార్యకర్తలు అన్నారు. పన్యాల జైపాల్ రెడ్డికి ఆసియాలోనే అతి పెద్దదైన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కేందుకు కృషి చేసిన తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డిని, ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలు చైతన్యపురిలోని పార్టీ కార్యాలయానికి భారీ సంఖ్యలో తరలి వచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రాంరెడ్డిని శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరిస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రాంరెడ్డి, జైపాల్ రెడ్డిని అభినందించారు. అందరూ కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలను, సంక్షేమాలను ప్రజలకు చేరవేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. అనంతరం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రైతులు గడ్డిఅన్నారం మార్కెట్కు వస్తుంటారు. మార్కెట్లో రైతుల సమస్యలను అర్థం చేసుకొని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు, లింగోజిగూడ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి నాయకుడికి గుర్తింపు ఉంటుందని ఇందుకు ఉదాహరణ నేనే అని ఆయన తెలిపారు. అందుకే కచ్చితంగా ప్రతి కాంగ్రెస్ సైనికుడు పార్టీ కోసం కష్టపడాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించడానికి కృషి చేయాలని ఆయన కోరారు.రాబోయే ఎన్నికల్లో లింగోజిగూడ నుండి కార్పొరేటర్ టికెట్ కేటాయిస్తే, మల్ రెడ్డి రాంరెడ్డి గారి నాయకత్వంలో పూర్తి సహకారం అందించి, విజయాన్ని సాధించేందుకు కృషి చేసి గెలిపించే బాధ్యత మేము తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లింగాల నాగేశ్వరరావు, సీనియర్ మైనార్టీ నాయకులు ఏం.డి .జానీ మియా,నరేందర్ గౌడ్, ఆనంద్, సతీష్, విజయ్, అరుణ్, చందు, షఫీ, శరత్, ఇంతియజ్, హుసేన్, రబ్బానీ, అస్లాం,వీరేందర్, అంజి, సంపత్, శ్రీనివాస్,హరి,సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



**చిట్యాల ,సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మండలంలో ఇటీవల చనిపోయిన తిర్మలాపూర్ గ్రామానికి చెందిన తోట.ఎల్లయ్య జడల పేట గ్రామానికి చెందిన గొర్రె. రాజయ్య నైన్ పాక గ్రామానికి చెందిన నాగుల. శంకరయ్య కంచర్ల. చంద్రయ్య కుటుంబాలను చిట్యాల మాజీ జెడ్పిటిసి గొర్రె. సాగర్ పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు శ్రీనివాస్ నాయక్,పిట్ట సురేష్ ,నల్ల దేవేందర్ రెడ్డి ,మిన్నపురం రమేష్ ,గొర్రె మల్లేష్ ,సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ టూరిజం డే సందర్భంగా కోటగోళ్ల సందర్శన



**చిట్యాల,సెప్టెంబర్ 28(మనం న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ బి శ్రీదేవి వరల్డ్ టూరిజం డే సందర్భంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప చరితాత్మక ప్రదేశమైన కోటగుళ్ల సందర్శన చేయించారు. కళాశాల లోని ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులను కోటగుళ్ళు రామప్ప చారిత్రక అంశాలు కాకతీయ సంస్కృతి కాకతీయుల కళా వైభవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం యుగంధర్, విద్యార్థులు, లెక్చరర్ లో నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## భారత వాయిసేన పథకంపై అవగాహన

**చిట్యాల,సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** అగ్ని పథ్లో భాగమైన వాయు సేన పై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఎయిర్ ఫోర్స్ అఫీషియల్ కార్పోరల్ . సందీప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎయిర్ ఫోర్స్ అధికారి సందీప్ మాట్లాడుతూ నేషనల్ డిఫెన్స్ అకాడమీ గురించి అగ్ని వీర్ వాయు సేనలో చేరుటకు వాటిని గురించిన అంశాలను అర్హతలను ఎంపిక పద్ధతిని వివరించారు. విద్యార్థులకు భారత ప్రభుత్వం చేపట్టే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమంలో ఇచ్చిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన వారికి సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు భారత త్రివిధ దళాలు అయినా పదాతి వాయు జల దళాల్లో చేరి భారత దేశ సేవ చేయాలని అగ్ని వీర్ వాయుసేనలో పాల్గొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై అధికారి సలహాలు సూచనలు



గ్రహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీదేవి కార్పోరల్ ఎన్. సందీప్. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యుగేందర్, లెక్చరర్లు నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వీడ్కోలు సమావేశం



**చిట్యాల, సెప్టెంబర్ 28(మనం న్యూస్) :** మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల, కళాశాల( మోడల్ స్కూల్) లో ఉపాధ్యాయుల విడుకోలు సమావేశం జరిగింది బదిలీపై వచ్చినటువంటి ఉపాధ్యాయులకు ఆహ్వానిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏం రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు సహజంగానే జరుగుతూ ఉంటాయి వాటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, బాధపడకూడదు వారి యొక్క నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి బదిలీపై వెళ్లిన పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ నేను ఇక్కడ ఉన్నంతవరకు విద్యార్థిని విద్యార్థుల యొక్క ఉన్నతి కోసం అభివృద్ధి కోసం మా ఉపాధ్యాయ బృందంతో పిల్లల్లో నైతిక విలువలు క్రమశిక్షణ మంచి విద్యా లక్ష్యాల గురించి ఎ ప్పుడు పాటుపడుతూ ఉండేవాళ్లం మంచిగా చదవాలి సమాజానికి పేరు తీసుకురావాలని హితబోధ చేశారు ఉపాధ్యాయులందరూ తమ అనుభవాలను నెమరు వేసుకుంటూ ఉద్వేగనికి లోనయ్యారు తర్వాత పిల్లలందరూ శాలువాలతో జ్ఞాపి కలతో, వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం చెప్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కరించారు ఈ కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపల్ ఏం రమేష్ , రవీందర్, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, డి వాణి, సమీరా నిషాత్, జ్యోత్స్న దేవి, ఆయేషా తబస్సుమ్, రాజు, శివ వీర ప్రసాద్, దివ్య ఎండి కలీం, ఫిజికల్ డైరెక్టర్ సమ్మయ్య, శ బిరుద్దీన్,శ్రీకాంత్, ప్రసన్న, రామస్వామి,రాణి,సుధీష్ణ,మధు నయ, సుగుణ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాదేవపూర్లో స్వచ్ఛ తా హీ సేవ



**మహాదేవపూర్, సెప్టెంబర్ 28, (మనం న్యూస్):** మహాదేవపూర్ మండల కేంద్రంలో స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మహాదేవపూర్ లోని ప్రభుత్వ పాఠశాల, కస్తూరి భా వసతి, గృహల్లోని పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ తా హీలో భాగంగా శ్రమాధానంతో పరిశుభ్రంగా చేశారు. పరిసరరాల్లో పేరుక పోయిన చేత్తా చేదరాన్ని తొలగించారు. గ్రామంలో పేరుక పోయిన చెత్తను తొలగించాలని గ్రామం స్వచ్ఛ తా హీ గా ఉండాలని గ్రామ కార్యదర్శి కల్పన అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రభుత్వ పాఠశాల, ఉపాధ్యాయులు పాఠశాల, విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పంచాయితీ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**చిట్యాల, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావ్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆయన చిట్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో ఇన్చార్జి సూపరిండెంట్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు స్వయంగా వెళ్లి రోగాలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు రోగులకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమమైన చికిత్స అందచేయాలని వైద్యులకు ఆయన సూచించారు.

## కొత్త సారుకు సమస్యల స్వాగతం




**భూపాలపల్లి, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** అది బంగారం.. కాదు.. వజ్రమో. వైడూర్యమో అంతకన్నా కాదు.. కానీ వాటి అన్నింటికి మించిన డిమాండ్ దానిది..... అదే ఇసుక .. ఇసుక ఇది నిత్యావసర సరుకు కంటే ఎక్కువ.. ప్రస్తుతం మార్కెట్ లో దాని డిమాండే వేరు. డిమాండ్ సప్లయ్ సూత్రాన్ని ఒంట పట్టించుకున్న వారు ఇసుకతో రాజ్యాన్ని ఏలుతున్నారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టే వనరుల్లో ఇసుక ప్రధాన మైనది. అలాంటి ఇసుకకు కేంద్ర బిందువు జిల్లాలోని మహదేవపురం గోదావరి తీరం. ఇసుక వ్యవహారాలు నిర్వహించే ఆ శాఖ అధికారిగా ఇప్పటి వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన అధికారి స్థానంలో కొత్త అధికారి నియమితులు కాగా ఈ ప్రాంతంలోని ఇసుక రిచుల్లోని సమస్యలు ( అక్రమాలు ) రాబోయే అధికారికి స్వాగతం పలుకుతున్నాయి. సదరు అధికారి సమస్యల (అక్రమాలకు) కు ఢ్డకట్ట వేస్తారో, వాటికి వారధిగా నిలుస్తారో వేచి చూడాల్సిందే మరి.

## దశదినకర్మలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**మహా ముత్తారం, సెప్టెంబర్ 28 (మనం న్యూస్) :** మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఆకుల శ్రీజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం దశ దినకర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వక్కల సదువలి పాల్గొని మృతురాలి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులు అర్పించి ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అనప వెంకటయ్య, మండల పార్టీ జనరల్ సెక్రెటరీ మోత్కూరు రవి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, నూకల రవి,యువజన కాంగ్రెస్ నాయకులు సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై ఉచిత వరాల జల్లులు

మొదటి పేజీతరువాయి...

మేనిఫెస్టోను విడుదల చేశారు. 90 అసెంబ్లీ స్థానాలు కలిగి ఉన్న హర్యానాలో అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే ఆయా పార్టీలు ఉధృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇక అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఉచిత హామీలతో శనివారం భారీ మేనిఫెస్టో విడుదల చేసింది.

**హామీలు ఇవే..**

ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్
రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం
18-60 ఏళ్ల మహిళలకు రూ.2000 ఆర్థిక సాయం
రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేత
రైతులకు (ఎంఎస్‌పీ) పంటలకు కనీస మద్దతు ధర హామీ
తక్షణ నష్టపరిహారం కోసం చట్టపరమైన హామీ
రైతు కమిషన్ ఏర్పాటు.. డీజిల్‌పై రాయితీ
పేదలకు 200 గజాల స్థలంలో డబుల్ బెడ్రూమ్ ఇల్లు
కులాల వారీగా సర్వే నిర్వహిస్తామని హామీ
క్రీమీ లేయర్ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు
యువతకు 2 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు
రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని హామీ

కేంద్రానికి విరుద్ధంగా పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేందుకు బుధప పెన్షన్, దివ్యాంగ్ పెన్షన్ మరియు విధ్వా పెన్షన్ కింద సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, వితంతువులకు వరుసగా రూ.6000 ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. హామీలు అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం అక్టోబర్ 8న విడుదల కానున్నాయి. 2019లో బీజేపీ 40 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 30 సీట్లు గెలుచుకుంది. ఈసారి ఎలాగైనా అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు.

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం

**శ్రీనగర్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని ఆ పార్టీ నేత ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రాజేయడానికి జమ్మూకశ్మీర్‌ను ఓ పావుగా బీజేపీ వాడుకుంటోందని ఆరోపించారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో భాగంగా ఇక్కడి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో శనివారం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ, అమిత్ షాపై విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్ పట్ల కాంగ్రెస్‌కు స్పష్టమైన విధానం ఉందని ప్రియాంక గాంధీ అన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెప్పారు. దర్బార్ సంప్రదాయాన్ని (సీజన్ వారీగా జమ్మూ, శ్రీనగర్ మధ్య ప్రభుత్వ కార్యాలయాల మార్పిడి) పునరుద్ధరిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ పౌరుల హక్కులను కాపాడుతామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తన నాన్నమ్మ ఇందిర గాంధీకి జమ్మూకశ్మీర్‌తో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆమె హత్య కావడానికి నాలుగైదు రోజుల ముందు కశ్మీర్ అందాలను చూడాలనుకుంటున్నట్లు తమతో పేర్కొన్నారని ప్రియాంక ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'మీకు రాష్ట్ర హోదా కావాలంటే తమకు ఓటేయండని అమిత్‌షా అడుగుతున్నారు. వాస్తవానికి రాష్ట్ర హోదా తీసుకున్నదే వారు. ఇదెలా ఉందంటే.. టీవీ ఎత్తుకెళ్లిన వారే 'టీవీ కావాలంటే నన్ను అడగండి' అన్నట్లు ఉంది' అని ప్రియాంక గాంధీ ఎద్దేవాచేశారు. జమ్మూకశ్మీర్‌పై ప్రధాని మోదీకి ఏమాత్రం ప్రేమ లేదని, వారి సమస్యలు ఆయనకు పట్టవని విమర్శించారు. తమ రాజకీయ చదరంగంలో జమ్మూకశ్మీర్ అనేది ఒక పావు మాత్రమేనని విమర్శిచారు. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి జమ్మూకశ్మీర్ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు.

## దేశ ప్రయోజనాలే ఏచూరి మిన్న

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 :** రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే మిన్నగా జీవితాంతం బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. శనివారం, ఇక్కడ తాల్‌కటోరా స్టేడియంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను ఆ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఏచూరికి నేను స్నేహితుడిని అయినందుకు గర్వంగా ఉందన్నారు.

## హర్యానా పదేండ్ల పీడ వదిలిస్తాం : రాహుల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 :** హర్యానాను పట్టుకున్న పదేండ్ల పీడకు తమ పార్టీ ముగింపు పలుకుతుందని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ శనివారం చెప్పారు. అక్టోబర్లో హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సమగ్ర మేనిఫెస్టోను వెలువరించింది. ఈ క్రమంలో రాహుల్ దేశ రాజధానిలో విలేకరులతో మాట్లాడారు. హర్యానాలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. దశాబ్దపు బిజెపి పాలన నుంచి ఇక రాష్ట్రానికి విముక్తి దక్కే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు తమ పార్టీపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు రంగం సిద్ధమైందని రాహుల్ ప్రకటించారు. ఇన్నేళ్ల పాలనలో బిజెపి హర్యానా సౌభాగ్యాన్ని, కలలను, శక్తిని హరించి వేసిందని రాహుల్ చెప్పారు. హర్యానా యువత దేశ భక్తి అపారమైనది, సైన్యంలో ఇక్కడి వారే ఎక్కువ. అయితే కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా ప్రవేశపెట్టిన అగ్నివీర్ స్కీంతో యువత ఉద్యోగవకాశాలకు గండికొట్టినట్లు అయిందని రాహుల్ సామాజిక మాధ్యమంలో హిందీలో వ్యాఖ్యానించారు. నిరుద్యోగం ఇక్కడి కుటుంబాల నవ్వులను మటుమాయం చేసేసింది. ఇక ద్రవ్యోల్బణం మహిళల స్వయం సమృద్ధిని హరించివేసిందని రాహుల్ విమర్శించారు.

# హైడ్రా అంటే భయం కాదు.. భరోసా



**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మనం న్యూస్):** మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో నివసిస్తున్న ప్రజలను బలవంతంగా కాకుండా ఇష్టప్రకారమే తరలిస్తున్నామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌ఎఫ్‌డీసీఎల్) ఎండీ దాన కిశోర్ తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. సంవత్సరాల తరబడి ఉన్న ప్రాంతం వీడి వెళ్లలేని వారి భావోద్వేగాన్ని అర్థం చేసుకోగలమని, వారికి సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. సొంత భవనాలు నిర్మించుకున్నవారికి నిబంధనల ప్రకారం చెల్లింపులు చేస్తామని.. నదీ గర్భంలో నివాసం ఉన్న పేదలను ప్రభుత్వం కన్నబిడ్డల్లా చూసుకుంటుందని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఉపాధి, వసతుల కల్పన, ఇళ్ల కేటాయింపులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. హైడ్రా అక్రమ కట్టడాలను కూల్చివేస్తుంది తప్ప.. నిరుపేదల ఇళ్లను కాదన్నారు. నగరంలో విపత్తుల నిర్వహణ, ఆస్తుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వ్యతిరేక ప్రచారం జరుగుతుండడం దురదృష్టకరంగా పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితుల తరలింపు, పునరావాసంపై గందరగోళం నెలకొన్న తరుణంలో ప్రభుత్వ ఉద్దేశం, చేపడుతున్న చర్యలపై దాన కిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి సచివాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. 'మూసీ నిర్వాసితులకు. రూ.30లక్షల విలువ చేసే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తున్నాం. అదనపు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.700కోట్లు మంజూరు చేస్తుంది. నిర్వాసితుల సంక్షేమం, ఉపాధి, వారి పిల్లల చదువులు, ఇతర అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్నాం. పట్టా భూములు ఉన్నవారికి భూ సేకరణ చట్టం ప్రకారం చెల్లింపులు చేస్తాం. 3 జిల్లాల కలెక్టర్లు, పురపాలక శాఖ యంత్రాంగం నిర్వాసితుల తరలింపునకు పనిచేస్తున్నారు. 32 ఎన్జీవోలతో కలిసి అధ్యయనం చేస్తున్నాం. మూసీ అభివృద్ధి పనులు 2 నెలల్లో మొదలు పెడతాం. అంతర్జాతీయంగా ఉన్న ప్రముఖ నదుల అభివృద్ధిలో పాలుపంచుకున్న ఏజెన్సీల నుంచి డీపీఆర్లు సేకరిస్తున్నాం. వాటి ఆధారంగా టెండర్లు పిలుస్తాం. నిర్వాసితులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తాం. నెల రోజుల్లో దీనిపై కార్యాచరణ సిద్ధమవుతుంది. పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి రుణాలిస్తాం' అని దాన కిశోర్ వివరించారు.

### ప్రజలు మురికి కూపంలో ఉండకూడదనే..

మూసీ మురికి కూపంలో ఉంటున్న ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నదని దాన కిశోర్ చెప్పారు. 2026 నాటికి మూసీలో గోదావరి నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూసీ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. రూ.3,800 కోట్లతో 970 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుభ్రత చేపడుతున్నామన్నారు. 116 ఏళ్ల క్రితం మూసీకి వరద వచ్చినప్పుడు పరివాహక ప్రాంతంలో నష్టపోయినవారి కోసం నిజాం చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. మూసీని ప్రపంచ పర్యాటక కేంద్రం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ ప్రక్షాళన చేపడుతున్నారని వివరించారు. పరివాహకంలోని చారిత్రక ఆనవాళ్లను సంరక్షించడంతో పాటు, సంప్రదాయ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు సంకల్పించారన్నారు. హైదరాబాద్ నగర జనాభా కోటికి పెరిగిందని, ఖైరతాబాద్‌లో 20 నిమిషాల్లో 9 సెం.మీ. వర్షం పడిందని, నగరం అంతా ఇదే స్థాయి వర్షం పడితే ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. మూసీ నదీ అభివృద్ధితో నగరం రూపురేఖలే మారిపోతాయన్నారు. పేదల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. 50 కి.మీ మేర మూసీ అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో 23 ప్రదేశాల్లో ఉన్న ప్రజలను 14 చోట్లకు తరలిస్తున్నామని దాన కిశోర్ తెలిపారు.

### నిర్మాణ అనుమతుల మంజూరుకు కొత్త టెక్నాలజీ

మున్సిపాలిటీల్లో నిర్మాణ అనుమతుల మంజూరుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు దాన కిశోర్ తెలిపారు. 3డీ సాంకేతిక పరిజ్ఞానంతో అనుమతులు పొందిన ఇంటిని.. బయటి నుంచే ఇచ్చిన కొలతల ప్రకారం ఉందా లేదా, ఉల్లంఘనలు జరిగాయా అని పరిశీలించే అవకాశం ఉందన్నారు. ఈ సాంకేతికతను రెరాకు ఇస్తున్నామన్నారు. ప్రతి వ్యవస్థలో తప్పులు ఉంటాయని, అలా చేసిన అధికారులను శిక్షిస్తున్నామని చెప్పారు. భవనాల అనుమతులను నిబంధనల ప్రకారమే మంజూరు చేస్తున్నారన్నారు. దుర్గం చెరువు బఫర్ జోన్ విషయంలో కొంత సందిగ్ధత ఉందని, నీటి పారుదల శాఖ అధికారులు నివేదిక రూపొందించి కోర్టుకు అఫిడవిట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఉన్నత విద్యావంతులు కూడా ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఎఫ్టీఎల్‌కు సంబంధించిన అన్ని మ్యాప్లను హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా, రెరా వెబ్‌సైట్లలో పెడుతున్నామన్నారు. ఓఆర్ఆర్ ఆవల ఉన్న 565 చెరువుల్లో 563 చెరువులకు ప్రిలిమనరీ నోటిఫికేషన్, 133 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఓఆర్ఆర్ లోపల 2,693 చెరువులకు గాను 2,052 చెరువులకు ప్రిలిమినరీ, 138 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలన్నీ యాప్ రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. స్థలాలు, ఇళ్లు కొనేవారు ఆ యాప్ ద్వారా ఎఫ్టీఎల్, బఫర్జోన్ వివరాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

### తప్పుడు ప్రచారంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య

అనధికారిక నిర్మాణాలతో ప్రజలను మోసం చేసిన బిల్డర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రంగనాథ్ తెలిపారు. ఇందుకు కారకులైన ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య బాధాకరంగా పేర్కొన్నారు. తప్పుడు ప్రచారంతో ఆమె భయాందోళనలకు గురై బలవన్మరణానికి పాల్పడిందన్నారు. జొన్వాడ్ ఫాం హౌస్ జీవో 111 పరిధిలో ఉందన్నారు. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదని రంగనాథ్ వివరించారు. అమీన్‌పూర్‌లో భారీగా భూములు అన్యాక్రాంతం అయినట్లు చెప్పారు. సున్నం చెరువులో వెంకటేష్ అనే వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేశారని, ఆయన ట్యాంకర్ల వ్యాపారంతో రోజుకు రూ.లక్ష సంపాదిస్తున్నారన్నారు. పేదలను ముందు పెట్టి స్వప్రయోజనాల కోసమే అలా వ్యవహరించినట్లు రంగనాథ్ చెప్పారు. వెంకటేష్ ఇప్పుడు 20 ట్యాంకర్లతో ఇప్పుడు మళ్లీ వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు.

### అనుమతులున్న వాటిని కూల్చడం లేదు: రంగనాథ్

హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ, పంచాయతీ నుంచి పక్కాగా అనుమతులున్న భవనాలను కూల్చడం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ కట్టడాల మీద వస్తున్న ఫిర్యాదులపైనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాము కూల్చిన భవనాలు వేటికీ అనుమతులు లేవని తెలిపారు. అనుమతులు ఉన్న ఏ భవనం జోలికీ వెళ్లలేదన్నారు. రాత్రికిరాత్రే వెళ్లి ఎవరి ఇంటిని కూల్చడం లేదని.. ముందస్తు సమాచారం ఇచ్చిన తరువాతనే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో అపోహలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. నిజమైన పేదలకు హైడ్రాతో అన్యాయం జరగదన్నారు. ఎన్ కన్వెన్షన్ను కూల్చివేసినా.. దాని పక్కన ఉన్న పేదల నివాసాల జోలికి వెళ్లని సంగతిని గుర్తుచేశారు.

### విద్యా సంవత్సరం ముగిశాక కాలేజీలపై చర్యలు

ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన కళాశాలలపై ఫిర్యాదులు వచ్చాయని.. పిల్లలు విద్యా సంవత్సరం నష్టపోతారనే వాటిపైన చర్యలు తీసుకోలేదని రంగనాథ్ పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిశాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు ప్రైవేటు సర్వే నంబరుతో అనుమతులు తీసుకుని నిర్మాణాలను మాత్రం ప్రభుత్వ సర్వే నంబర్లలో చేస్తున్నట్లు చెప్పారు. దుండిగల్లో పాత తేదీలతో పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొందారని తెలిపారు. ఇలాంటి కేసుల్లో చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'అమీన్‌పూర్‌లో ఓ ఆస్పత్రిలో రోగులు ఉండగా కూల్చామని చెప్పడం అవాస్తవం. మూడుసార్లు హెచ్చరికలు చేసినా మళ్లీ మళ్లీ నిర్మాణాలు చేస్తుండడంతో హైడ్రా ఏర్పాటయ్యాక నేలమట్టం చేశాం. ఆ సమయంలో వీడియో తీశాం. అక్కడ రోగులు ఎవరూ లేరు. ఆస్పత్రి పేరుతో అక్రమ కట్టడం తప్ప ఆ భవనంలో ఆస్పత్రి లేదు. పేదలను ముందుపెట్టి కొందరు పెద్దలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు'' అని తెలిపారు. హైడ్రాను ఓ బూచీగా చూపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. హైడ్రా భరోసా మాత్రమేనని తేల్చి చెప్పారు. వరదలు, విపత్తుల నుంచి హైదరాబాద్‌ను కాపాడి, భవిష్యత్తులో సమస్యలు లేకుండా చూసేందుకే హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. విపత్తుల నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ చర్యలు చేపడుతుందే తప్ప పేదల నివాసాలను కూల్చేందుకు కాదన్నారు. అధిక శాతం మీడియా పూర్తి సహకారం అందిస్తున్నా.. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారంతో లేనిపోని అపోహలు కల్పిస్తున్నారని తెలిపారు.

### ఇప్పుడు కాకుంటే మరెప్పటికీ కాపాడుకోలేం

ముందుగా సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయడం లేదని.. తగిన సమయం ఇచ్చాకే ఆక్రమణలను నేలమట్టం చేస్తున్నట్లు రంగనాథ్ పేర్కొన్నారు. పేదలు మధ్య తరగతి వారు చెరువులను ఆక్రమించరని.. అక్రమ కట్టడాల వెనుక పెద్దలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను తీసుకొచ్చారని.. చెరువులు, నాలాలను కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పుడు కాకుంటే వాటిని మరెప్పటికీ కాపాడుకోలేమని తేల్చి చెప్పారు. జొన్వాడ్ ఫాం హౌస్ జీవో 111 పరిధిలో ఉందన్నారు. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదని రంగనాథ్ వివరించారు.

## హైడ్రా కమిషనర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ కేసు..

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో కేసు నమోదైంది. హైడ్రా తమ ఇళ్లు కూలుస్తుందన్న భయంతో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై ఆమె కుటుంబ సభ్యులు ఎన్‌హెచ్‌ఆర్సీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో 16063/ఐఎన్/224 కింద రంగనాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్సీ వెల్లడించింది. కాగా, బుచ్చమ్మ మరణానికి హైడ్రాకు ఎటువంటి సంబంధం లేదని.. ఎవరికీ తాము నోటీసులివ్వలేదని రంగనాథ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే..

# అభివృద్ధి సంక్షేమంపై నిరంతర పోరాటం

**సూర్యాపేట, సెప్టెంబర్ 28 (మనం ప్రతినిధి):** ఏ ఆశయ సాధన కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందో ఆ ఆశయాలనుగత పాలకులు పదేళ్ల కాలం పాటు అణగద్రొక్కారని తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయ అన్నారు అందుకోసం జరిగిన అమరుల ఆత్మ బలిదానాల కుటుంబాలను ఆదుకోవాలని ప్రశ్నించిన ప్రజా గొంతు నొక్కిన నాటి ప్రభుత్వ భాద్యులు నేడు వారి చేతులోనే రాజకీయ బలిదానం అయ్యారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు శనివారం జిల్లా కేంద్రంలోని జె ఫంక్షన్ హాల్లో జరిగిన ఆ పార్టీ జిల్లా పార్టీ ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం వారి కుటుంబాలను ఏమర్చిందని ఆరోపించారు. సామాన్య ప్రజలు కోరుకున్న తెలంగాణ కాకుండా దొరల తెలంగాణను అనుభవించారని గుర్తు చేశారు అధికారంలో ఉన్నామని పరాన్న జీవులు లాగా అడ్డగోలుగా అవినీతి, అక్రమాలు చేసి నేడు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు.బిఆర్ఎస్ అధినేత తన కుటుంబ సభ్యులు నియామకాలు ఏర్పాటు చేసుకొని, నాటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నిధులు సమకూర్చారని, వరుణ దేవుడి కరుణ వల్ల తెలంగాణ కి జలకళ వస్తే అట్టి నీళ్ళను కూడా తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నారు తెలిపారు అదే నీళ్ళ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.70వేల కోట్లు అంచనా వేసి రూ.1లక్ష 20 వేల కోట్లతో నిర్మాణం పూర్తి చేశారని తేల్చి చెప్పారు. అయినప్పటికీ వారి అక్రమాలు,కమీషన్ల వల్ల కాళేశ్వరం నేడు ఎందుకు పనికి రాకుండా పోయిందని అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పుల కుప్పల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఆదాయంలో నెలకు రూ.5 వేల కోట్ల అప్పులకు చెల్లించాల్సి వస్తుందని వెల్లడించారు.విద్యుత్ కొనుగోలులో సైతం ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పలేదన్నారు. ధరణి వల్ల పేదల భూములు అక్రమార్కుల చేతిలోకి వెళ్ళయని, అందువల్ల ఆర్ఓఆర్‌పై నూతన అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మనం అప్రమత్తంగా ఉంటూ ప్రజలు అరమయ్యేలా, అవి అర్హులకు చేకూరేలా పని చేయాలని కార్యకర్తలకు హిత బోధించారు. అటువంటప్పుడు వారి కుటుంబాలను న్యాయం చేకూర్చిన వారమవుతమని సూచించారు.ఇటువంటి మార్పు కోసం నాడు టిజెఎస్ పార్టీ స్థాపన జరిగిందని,నైతిక విలువలను కాపాడుకుంటూ సామాజిక ఉద్యమాలు కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.పార్టీ జిల్లా అధ్యక్షులు గట్ల రమా శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ ప్లీనరీలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇన్చార్జి కుంట్ల ధర్మార్జున్,మరో ప్రధాన మొగంపల్లి ఆశప్ప, నాయకులు సర్దార్ వినయ్ కుమార్, నారబోయిన కిరణ్ కుమార్, బొడ్డు శంకర్, బచ్చలికూరి గోపి, వీరేశ్ నాయక్, కృష్ణారెడ్డి, చంద్రకాంత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన సవ్యసాచి ఘోష్ (ఐఎఎస్) శనివారం మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి ధన్యవాదాలు తెలిపారు.
హైదరాబాద్ (మనం న్యూస్)

# వేర్పాటువాదం.. రక్తపాతానికి చోటులేదు

**జమ్మూ, సెప్టెంబర్ 28 :** తొలి రెండు విడతల పోలింగ్ అనంతరం జమ్మూకశ్మీర్లో తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ నేపథ్యంలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఉగ్రవాదం, అవినీతి అంశాలకు సంబంధించి కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీపై విమర్శలు గుప్పించారు. మొదటి రెండు విడతల పోలింగ్ సరళితో బీజేపీ తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీ సాధించడం ఖాయమైంది. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. రెండు విడతల్లో ప్రజలు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బీజేపీ గెలుపు తథ్యమైందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడనుందని, ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీల 'మూడు కుటుంబాల' పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్ష తిరిగి చోటుచేసుకోరాదని, వేర్పాటువాదం, రక్తపాతానికి ఇంకెంత మాత్రం చోటులేదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ఆశిస్తున్నాను. ఆ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు బీజేపీ పాలన రావాలని కోరుకుంటున్నారు' అని మోదీ అన్నారు.

అర్బన్ నక్సల్స్ గుప్పిట్లో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, వారిని బుజ్జగించడానికి ఆ పార్టీ ఏమైనా చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కశ్మీర్లో జవాన్ల త్యాగాల గురించి కాంగ్రెస్‌కు తెలియదని దుయ్యబట్టారు. 'ఇది కొత్త భారతం. ఇంట్లోకి చొరబడి మరీ హతమారుస్తుంది' అంటూ 2016లో సరిగ్గా ఇదే రోజు (సెప్టెంబరు 28) పాకిస్థాన్‌పై జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం అనేది కొద్ది కాలానికి మాత్రమే తీసుకున్న నిర్ణయమని మోదీ వివరించారు. జమ్మూకశ్మీర్లో మూడో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో శనివారం ప్రధాని మోదీ పర్యటించారు. జమ్మూ నడిబొడ్డున ఉన్న ఎమ్ఏఎమ్ స్టేడియంలో జరిగిన బీజేపీ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్- ఎన్సీ కూటమి, పీడీపీ పార్టీలపై విరుచుకుపడ్డారు. కశ్మీర్ ప్రజలకు ఆ మూడు పార్టీలు అన్యాయం చేశాయన్నారు. అవి తమ కుటుంబాలకు మేలు చేసుకున్నాయేగానీ, అంతులేని బాధల్లో ఉన్న కశ్మీరీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. లోపాయికారీ కాంగ్రెస్ రాజకీయాలు, నిర్లక్ష్యమే కశ్మీరీలకు శాపాలుగా మారాయన్నారు. 'పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్ విశ్వసనీయతను ప్రశ్నించే కాంగ్రెస్ ద్రోహాన్ని మరవగలమా? ఓటుబ్యాంకు కోసం విదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ స్వాగతం పలుకుతోంది. సొంత ప్రజలను మాత్రం అవమానిస్తోంది'' అని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మోదీ అన్నారు. బీజేపీకి మాత్రమే ఆ శక్తి ఉన్నదని స్పష్టం చేశారు. ''తమను గెలిపిస్తే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్-ఎన్సీ, పీడీపీ చెబుతున్నాయి. బీజేపీకి అధికారం కట్టబెడితే మహిళా సాధికారికత కోసం పాటుపడతామని వివరించారు. 'స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటుచేసి అక్కచెల్లెమ్మలను ధనవంతులను చేస్తాం. తగిన శిక్షణ ఇప్పించి డ్రోన్లను వారికి ఇప్పిస్తాం' అని తెలిపారు.

కాగా, అక్టోబర్ 1న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తుది (మూడవ) విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

## అరంగేట్ర స్పిన్నర్ ధాటికి న్యూజిలాండ్ ఆలౌట్..



గాలే స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ కుప్పకూలింది. సుదీర్ఘ ఫార్మాట్లో శ్రీలంక పై చెత్త రికార్డు నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల వైఫల్యంతో 88 రన్స్‌కే పర్యాటక జట్టు ఆలౌటయ్యింది. 1992 తర్వాత లంకపై మరీ ఇంత తక్కువకు న్యూజిలాండ్ ఆలౌట్ కావడం ఇదే తొలి సారి. ఇంతకుముందు లంకపై 102కు కివీస్ పది వికెట్లు కోల్పోయింది. మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే ప్రభాత్ జయసూర్య(6/42), అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పీరిస్(3/33)ల విజృంభించారు. కివీస్ ఆటగాళ్లను వరుసపెట్టి పెవిలియన్ చేర్చి పతనాన్ని శాసించారు. ఓవైపు అందరూ క్యూ కడుతుంటే.. ఆల్రౌండర్ మిచెల్ శాంటన్నర్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడంటే అర్థం చేసుకోవచ్చు లంక బౌలర్లు ఏ మేర చెలరేగారో. ఫాలో ఆన్లోనూ న్యూజిలాండ్ ఆట మారలేదు. 121 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది.

శ్రీలంక పర్యటనలో న్యూజిలాండ్ జట్టు తేలిపోతోంది. బ్యాటర్ల వైఫల్యంతో తొలి టెస్టులో కంగుతిన్న కివీస్.. రెండో టెస్టులోనూ ఓటమి దిశగా పయనిస్తోంది. తొలుత ప్రభాత్ జయసూర్య (6/42), నిషాన్ పీరిస్(3/33)లు చెలరేగడంతో పర్యాటక జట్టు 88 పరుగులకే కుప్పకూలింది. రమేశ్ మెండిస్ స్థానంలో జట్టులోకి వచ్చిన నిషాన్ తన తొలి మ్యాచ్లోనూ మ్యాజిక్ చేశాడు. కీలక వికెట్లు తీసి తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ నిషాన్ ధాటికి కివీస్ కుదేలైంది. ఓపెనర్ డెవాన్ కాన్వే(61) పట్టుదలతో అర్ధ సెంచరీతో కొట్టగా.. కేన్ విలియమ్సన్(46) భారీ స్కోర్ చేయలేకపోయాడు.

తొలి టెస్టులో చివరిదాకా పోరాడిన రచిన్ రవీంద్ర(12)ను సైతం బౌల్ చేసిన నిషాన్ ఆతిథ్య జట్టును విజయానికి మరింత దగ్గర చేశాడు. 121 పరుగులకే టాప్ ఆటగాళ్లంతా డగౌట్కు చేరిన వేళ టామ్ బ్లండెల్(26 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్(10)లు ఆచి తూచి ఆడుతున్నారు. వీళ్లు ఇప్పటికైతే ఆరో వికెట్‌కు 36 రన్స్ జోడించారు. అయినా న్యూజిలాండ్ ఇంకా 357 పరుగులు వెనకబడి ఉంది. చూస్తుంటే.. మూడో రోజు ఆట ముగిసే లోపు లేదా నాలుగో రోజు తొలి సెషన్లోనే లంక జయభేరి మోగించడం ఖాయమనిపిస్తోంది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 602-5 వద్ద డిక్లేర్ చేసింది. కమిందు మెండిస్, కుశాల్ మెండిస్, దినేశ్ చండిమల్‌లు సెంచరీలతో విరుచుకుపడగా తొలి రోజే లంక టెస్టుపై పట్టు బిగించింది.

# రెండో రోజు వర్షార్పణం

కాన్పూర్ వేదికగా భారత్ - బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు వర్షార్పణమైంది. వరుణుడు తీవ్ర ప్రతాపం చూపించ డంతో ఒక్క బంతి పడకుండా రెండో రోజు ఆట రద్దయింది. అయితే మధ్యాహ్నం 2 గంటల సమయంలో వర్షం తగ్గుముఖం పట్టింది. కానీ మైదానం పూర్తిగా తడిసిపోయింది. మిగిలిన సమయంలో ఔట్ ఫీల్డ్ను మెరుగుపర్చడం కష్టమని భావించిన అంపైర్లు రెండో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

శనివారం ఉదయం నుంచి మైదానంలో కవర్లను కప్పి ఉంచారు. రేపు ఆట జరిగే అవకాశం ఉంది. అయితే సజావుగా సాగడం అనుమానమే అనిపిస్తోంది. వర్షం ముప్పు ఉంది. కాగా, ఇవాళ లంచ్ విరామానికి ముందే ఇరు జట్లు ఆటగాళ్లు మైదానాన్ని విడిచి హోటల్‌కు చేరుకున్నారు. మైదా నం సిద్ధమవ్వడానికి ఆలస్యం అవుతుందని భావించి హోటల్‌కు ముందు గానే వెళ్లిపోయారు.

కాగా, వరుణుడు ప్రభావంతో తొలి రోజు ఆటలో కేవలం 35 ఓవర్లు మాత్రమే జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆట ముగిసేసరికి బంగ్లాదేశ్ 35 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (6), మోమినుల్ హక్ (40) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు, అశ్విన్ ఒక వికెట్ తీశారు. తడి ఔట్ ఫీల్ కారణంగా తొలి రోజు ఆట గంట ఆలస్యంగా మారింది. అయితే వరుణుడు ఎంట్రీ ఇవ్వడంతో లంచ్ విరామ సమయానికి ముందే ఆటగాళ్లు మైదా నాన్ని వీడారు.రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే వర్షం పడటంతో అంపైర్లు తొలి రోజు ఆట ముగిసిందని ప్రకటించారు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన బంగ్లాదేశ్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. యువ పేసర్ ఆకాశ్ దీప్ బంగ్లాదేశ్ ఓపెనర్ జకీర్ హసన్(0)ను క్లీన్ బౌల్ చేశాడు. 24 బంతులాడి ఒక్క పరుగు కూడా చేయకుండా జకీర్ పెవిలియన్ చేరాడు. సెకండ్ స్లిప్



యశస్వి జైస్వాల్ స్టన్నింగ్ క్యాచ్‌తో వెనుదిరిగాడు.

కాసేపటికే మరో ఓపెనర్ షెడ్మన్ ఇస్లామ్(24)ను కూడా ఆకాశ్ దీప్ ఔట్ చేశాడు. వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (27) బౌండరీలతో జోరు కనబర్చాడు. అయితే క్రీజులో పాతుకుపోయే ప్రయత్నం చేసిన అతన్ని అశ్విన్ ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చాడు. దాంతో బంగ్లాదేశ్ 80 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన ముష్ఫికర్ రహీమ్‌తో మోమినల్ హక్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడారు.

# ముషీర్‌ఖాన్‌కు ప్రమాదం

- రోడ్డు యాక్సిడెంట్లో తీవ్ర గాయాలు
- మూడు నెలల పాటు క్రికెట్‌కు దూరం

లక్నో: ముంబై యువ ఆల్రౌండర్ ముషీర్‌ఖాన్ తృటిలో పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం తన స్వస్థలం అజంఘర్ నుంచి లక్నోకు కారులో బయల్దేరిన ముషీర్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పూర్వంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొట్టిన ముషీర్ ఖాన్ కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ముషీర్‌తో పాటు తండ్రి నౌషద్‌ఖాన్ తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ముషీర్ ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేదాంత దవాఖాన ఆర్థోపెడిక్ డైరెక్టర్ ధర్మేంద్రసింగ్ పేర్కొన్నారు. ముషీర్ ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు బీసీసీఐతో పాటు ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. అతను కొద్దిగా కుదురుకున్న తర్వాత ముంబైకి తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు ప్రమాదం కారణంగా త్వరలో జరగనున్న ఇరానీ కప్‌తో పాటు రంజీ ట్రోఫీలో కొన్ని మ్యాచ్లకు ముషీర్ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## ఐపీఎల్‌లో నవశకం.. తొలిసారి మ్యాచ్ ఫీజు ప్రకటించిన బీసీసీఐ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలానికి ముందే ఓ శుభవార్త. ఈ లీగ్‌లో ఆడుతున్న, ఆడాలనుకుంటున్న క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తీపి కబురు చెప్పింది. క్రికెటర్లకు మరింత ఆర్థిక లబ్ది చేకూర్చేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీల్ చరిత్రలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ఆ మెగా టోర్నీలో ఆడే క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు ప్రకటించింది. ఐపీఎల్ ఆడే క్రికెటర్లకు సైతం మ్యాచ్ ఫీజు చెల్లించాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుందని సెక్రటరీ జై షా వెల్లడించాడు. రాబోయే సీజన్ నుంచి ఐపీఎల్లో ప్రతి మ్యాచ్‌కు ఆటగాళ్లు రూ.7.5 లక్షలు ఫీజుగా అందుకుంటారని, తద్వారా ఒక ఎడి షన్లో ఒక్కో క్రికెటర్ రూ.1.05 కోట్లు ఆర్జిస్తారని షా వివరిం చాడు. 'ఐపీఎల్లో అన్ని లీగ్ మ్యాచ్లు ఆడే క్రికెటర్‌కు ఒక ఎడిషన్లో రూ. 1.05 కోట్ల ఆదాయం సమకూరనుంది. దాంతో, ఫ్రాంచైజీ అందించే కాంట్రాక్ట్ మొత్తంతో పాటు అదనంగా కోటి రూపాయలు వాళ్ల ఖాతాలో చేరనుంది. ప్రతి ఫ్రాంచైజీ మ్యాచ్ ఫీజుల కిద రూ.12.6 కోట్లు కేటాయిస్తాయ'ని జై షా తన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించాడు. ఇంకేముంది.. బీసీసీఐ చారిత్రక నిర్ణయం పట్ల క్రికెటర్లు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక 18వ సీజన్ ఐపీఎల్‌కు ముందే మెగా వేలం జరుగనుంది. నవంబర్ చివరి వారం లేదా డిసెంబర్ మొదటి వారంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో వేలం నిర్వహించే అవ కాశముంది.

## గాయత్రి, త్రిసా జోడీకి కాంస్యం

మకావు: మకావు ఓపెన్ సూపర్-300 టోర్నీలో భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీకి కాంస్య పతకం దక్కింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో గాయత్రి, త్రిసా జోడీ 17-21, 21-16, 10-21తో చైనీస్తైపీ జంట హు పీ షాన్, హంగ్ ఎన్జు చేతిలో పోరాడి ఓడింది. మూడో సీడ్గా బరిలోకి దిగిన గాయత్రి, త్రిసా.. చైనీస్ జోడీకి దీటైన పోటీ నివ్వడంలో విఫలమయ్యారు. తొలి గేమ్‌లో ఒకింత ప్రతిఘటన కనబరిచినా.. వీరు రెండో గేమ్ గెలిచి పోటీలోకి వచ్చారు. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ఊహించని పరాజయం ఎదురైంది. వీరి నిష్క్రమణతో మకావు ఓపెన్లో భారత్ పోరాటం ముగిసింది.







# ఐఫా ఉత్సవాల్లో సందడి చేసిన తారలు..

సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక యూఏఈ రాజధాని అబుదాబి వేదికగా శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి నటులు హాజరై సందడి చేశారు. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి, ఏఆర్ రెహమన్, వెంకటేశ్, బాలకృష్ణ, సమంత, రానా తదితరులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. స్టార్ నటులు ఐశ్వర్య రాయ్ బచ్చన్, కృతి సనన్, కీర్తి సురేశ్, మృణాల్ ఠాకూర్, నాని, ఊర్వశి రౌతేల, షాహిద్ కపూర్ తదితరులు సందడి చేశారు. కోలీవుడ్ దిగ్గజం మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్ని యిన్ సెల్వన్ చిత్రం ఏకంగా ఏడు అవార్డులను దక్కించుకుంది.

ఇక ఈ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి మరో ప్రతిష్ఠాత్మక అవార్డును కైవసం చేసుకున్నారు. ఐఫా 2024కు గాను ఔట్ స్టాండింగ్ అచీవ్మెంట్ ఇన్ ఇండియన్ సినిమా అవార్డును మెగాస్టార్ అందుకున్నారు. బాలీవుడ్ దిగ్గజం లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ చేతుల మీదుగా మెగాస్టార్ ఈ అవార్డును అందుకున్నారు. మరోవైపు ఉత్తమ చిత్రం విభాగంలో రజనీకాంత్ నటించిన జైలర్



సినిమాకు అవార్డు దక్కగా.. ఉత్తమ నటుడు తెలుగు విభాగంలో దసరా సినిమాకు నాని అవార్డు అందుకున్నాడు.

ఈ క్రమంలో తాజాగా సమంతకు అరుదైన గౌరవం దక్కింది. వుమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకుంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి నటులు హాజరై సందడి చేశారు. ఈవెంట్లో భాగంగా రెండో రోజు స్టార్ నటులు సమంత, రానా, వెంకటేశ్, బాలకృష్ణ, చిరంజీవి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఈ వేడుకల్లోనే సామ్‌ను నిర్వాహకులు ప్రతిష్ఠాత్మక 'వుమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'తో సత్కరించారు.






### ఇక ఎవరెవరు ఏ కేటగిరీల్లో అవార్డు గెలుచుకున్నారంటే..

ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా – మెగాస్టార్ చిరంజీవి
ఔట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఇండియన్ సినిమా – ప్రియదర్శన్
ఐఫా వుమెన్ ఆఫ్ ది ఇయర్ – సమంత
ఐఫా గోల్డెన్ లెగసీ అవార్డు – బాలకృష్ణ
ఐఫా ఔట్ స్టాండింగ్ ఎక్సలెన్స్ (కన్నడ)– రిషబ్ శెట్టి
ఉత్తమ చిత్రం (తమిళం) – జైలర్
ఉత్తమ నటుడు (తెలుగు)– నాని (దసరా)
ఉత్తమ నటుడు (తమిళం)– విక్రమ్ (పొన్నియిన్ సెల్వన్ 2)
ఉత్తమ నటి (తమిళం) – ఐశ్వర్యారాయ్ (పీఎస్ 2)
ఉత్తమ దర్శకుడు (తమిళం) – మణిరత్నం (పీఎస్ 2)
ఉత్తమ సంగీత దర్శకుడు (తమిళం) – ఏఆర్ రెహమన్ (పీఎస్ 2)
ఉత్తమ నేపథ్య గాయకుడు – చిన్నంజిరు (పీఎస్ 2)
ఉత్తమ నేపథ్య గాయని – శక్తిశ్రీ గోపాలన్ (పీఎస్ 2)
ఉత్తమ విలన్ (తమిళం) – ఎస్జే సూర్య (మార్క్ ఆంటోనీ)
ఉత్తమ విలన్ (తెలుగు) – షైన్ టామ్ (దసరా)
ఉత్తమ విలన్ (కన్నడ) – జగపతి బాబు
ఉత్తమ సహాయ నటుడు (తమిళం) – జయరామ్ (పీఎస్ 2)
ఉత్తమ సినిమాటోగ్రఫీ – మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి
ఉత్తమ లిరిక్స్ – జైలర్ (హుకుం)
ఉత్తమ విలన్ (మలయాళం) – అర్జున్ రాధాకృష్ణన్
ఉత్తమ నటి (కన్నడ) – రుక్మిణి (సప్త సాగర దాచే ఎల్లో – సైడ్ ఎ)
ఉత్తమ నటుడు (కన్నడ) – రక్షిత్ శెట్టి (సప్త సాగరదాచే ఎల్లో – సైడ్ ఎ)
బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ – బ్రహ్మానందం(రంగమార్తాండ)



# అంచనాలు మొత్తం రివర్స్

'దేవర'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి మొదటిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది జాన్వీ కపూర్. ఇందులో తను తంగం అనే పాత్రలో కనిపించింది. 'దేవర'లో జాన్వీ కపూర్ హీరోయిన్ అని ప్రకటించిన కొన్నిరోజుల్లోనే 'చుట్టమల్లే' పాటను విడుదల చేశారు. ఆ పాటలో జాన్వీని చూసి కుర్రకారు అంతా ఫిదా అయిపోయారు. సినిమాలో తన గ్లామర్ ఇంకెలా ఉంటుందో అని అంచనాలు పెట్టేసుకున్నారు. కానీ 'దేవర'లో అంతా రివర్స్ అయ్యింది. జాన్వీ కపూర్కు కేవలం మూడు సీన్స్ మాత్రమే ఉన్నాయి. 'చుట్టమల్లే' పాటలో మాత్రమే కుర్రకారును ఉర్రూతలూగించేలా స్టెప్పులేసి, గ్లామర్ షో చేసి ఆ తర్వాత మాయమయి పోయింది. ఇక 'దేవర' సినిమా చూసిన ప్రేక్షకులంతా జాన్వీ కపూర్ అందం అంతా వేస్ట్ అయిపోయిందని ఫీలవుతున్నారు. కనీసం 'దేవర 2'లో అయినా జాన్వీ కపూర్ గ్లామర్, యాక్టింగ్ను కొరటాల శివ పూర్తిగా యూజ్ చేసుకుంటే బాగుంటుందని ఫ్యాన్స్ అనుకుంటున్నారు.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A, Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana. , **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.